
0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 51 విశాఖపట్నం, 29 నవంబరు 2023 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## కేంద్ర ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు కావాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలుచేయాలని, ఇందులో ఎటువంటి అలసత్వానికి తావివ్వరాదని జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశా) అధ్యక్షురాలు మరియు అరుకు పార్లమెంట్ సభ్యులు గొడ్డేటి మాధవి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో దిశా సమీక్ష సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జునతో కలిసి ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి సమీక్షా సమావేశాలకు జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని, తప్పని పరిస్థితుల్లో అనుమతి పొంది బాధ్యత గల అధికారులను పంపాలని సూచించారు. అదేవిధంగా అధికారులు సమీక్షకు హాజరైనపుడు పూర్తి సమాచారంతో హాజరుకావాలే తప్ప, అసంపూర్తి సమాచారంతో హాజరు కారాదని ఆమె హితవు పలికారు. ప్రతి మూడు మాసాలకు ఒకసారి ఈ సమీక్షా సమావేశాన్ని నిర్వహించాల్సి ఉందని, వచ్చే సమావేశానికి జిల్లా శాఖాధిపతులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమీక్షకు గైర్హాజరు అయిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. తొలుత అటవీ , వికలాంగుల సంక్షేమం, నీటి పారుదల, ఐ.సి.డి.ఎస్, గనులు, జివియంసి, సమగ్ర శిక్ష, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, పౌర సరఫరాలు, డి.ఆర్.డి. ఎ, డ్వామా, ఏ.పి.ఇ. పి.డి.సి.ఎల్ తదితర శాఖలను సమీక్షించిన ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ఆయా శాఖల్లో పెండింగులో ఉన్న పనులను సకాలంలో పూర్తిచేసి లక్ష్యాలను అధిగమించాలని

(మిగతా 2లో)

## ఓబిసి రిజర్వేషన్లకై కేంద్రప్రభుత్వానికి సిఫార్సు : జీవీఎల్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం బిజెపి రాజ్యసభ ఎంపి జీవీఎల్ నరసింహారావు న్యూఢిల్లీలో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సిబిసి) ఛైర్మన్ హన్సరాజ్ అహిర్‌ని కలుసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుకాపులు, కళింగ వైశ్యులు, శిష్టకరణాలు, సొండి కులాలకు కేంద్ర ఓబిసి రిజర్వేషన్లకై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ఒబిసి జాబితాలో ఏదైనా కులాన్ని చేర్చడానికి ఎన్‌సిబిసి సిఫార్సు తప్పనిసరి అయిన నేపథ్యంలో, ఎన్‌సిబిసి చేసిన ఈ సిఫార్సు చాలా కీలకమైనది.

రాష్ట్రంలో 40 లక్షలకు పైగా వున్న తూర్పు కాపులు, కళింగ వైశ్యులు, శిష్టకరణాలు, సొండి కులాలకు కేంద్ర ఓబీసీ రిజర్వేషన్ల అం



శాన్ని ఎంపీ జీవీఎల్ నరసింహారావు రెండేళ్లగా పార్లమెంట్ లోపల, వెలుపల అనేక మార్లు లేవనెత్తుతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఎంపీ

(మిగతా 2లో)

## చంద్రబాబు స్కిల్ కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు సుప్రీంకోర్టు తాజాగా ఆంక్షలు విధించింది. స్కిల్ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీనిని ఏపీ సీఐడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీని పైన విచారించిన సుప్రీం ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఇదే సమయంలో చంద్రబాబుకు తాజాగా కండీషన్లు విధించింది. ఈ కేసు తదుపరి విచారణను డిసెంబర్ 11వ తేదీకి వాయిదా వేస్తూ సుప్రీం నిర్ణయం తీసుకుంది.

**సుప్రీంకోర్టు ఆంక్షలు :** చంద్రబాబుకు సుప్రీం కోర్టు కండీషన్లు విధించింది. స్కిల్ స్కాంలో 53 రోజులు జైలులో ఉన్న చంద్రబాబుకు ఏపీ హైకోర్టు తొలుత మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆరోగ్య కారణాలతో బెయిల్ ఇచ్చిన హైకోర్టు పలు కండీషన్లను



ఖరారు చేసింది. ఆ తరువాత చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది.

హైకోర్టు వెలువరించిన తీర్పు మేరకు చంద్రబాబు రేపటి నుంచి స్వేచ్ఛగా రాజకీయ కార్యకలాపాల తో పాటుగా అన్నింటా పాల్గొనవచ్చు. ఈ నెల 30న ఏసీబీ కోర్టు ముందు హాజరు కావాలని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే, హైకోర్టు స్కిల్ కేసులో చంద్రబాబుకు బెయిల్ ఇవ్వటం సమంజసం కాదంటూ సీఐడీ సుప్రీంలో పిటీషన్ దాఖలు చేసింది. దీనిని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం విచారించింది.

**విచారణ వాయిదా :** సీఐడీ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటీషన్ విచారణకు స్వీకరించిన ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. సీఐడీ తరపున వాదించిన ముఖుల్ రోహిత్గీ ఈ కేసులో చంద్రబాబుకు బెయిల్ అంశంతో పాటుగా కండీషన్ల నుంచి మినహాయింపు ఇవ్వటం పైన అభ్యంతరం వ్యక్తం చేసారు. దీంతో, సుప్రీం కోర్టు ఈ కేసును వచ్చే నెల 11వ తేదీకి వాయిదా వేసింది.

ఇదే సమయంలో గతంలో మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో హైకోర్టు విధించిన

(మిగతా 2లో)




## నేవీ డే వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** డిసెంబర్ 04వ తేదీన నిర్వహించనున్న నేవీ డే వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అందరూ సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు. సామాన్య ప్రజలు, ప్రముఖుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకోవాలని, లైఫ్ గార్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జాగురూకత వహించాలని చెప్పారు. నేవీ డే వేడుకలు నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై నేవల్ కమాండ్, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై చర్చించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు మార్గనిర్దేశకాలు జారీ చేశారు.

(మిగతా 2లో)

## నాణ్యమైన విద్యుత్ అందివ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యం: సీఎం



**అమరావతి:** ప్రతీ ప్రాంతానికి నాణ్యమైన విద్యుత్ అందివ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సబ్‌స్టేషన్లు లేక ఇబ్బంది పడుతున్న వారికి కష్టాలు తీరనున్నాయని, ఇవాళ ప్రారంభించిన సబ్‌స్టేషన్లను స్థానికులకే అంకితం చేస్తున్నామని సీఎం అన్నారు. రైతులకు 9 గంటల విద్యుత్ పగటి పూటే ఇవ్వాలని అధికారంలోకి రాగానే నిర్ణయించామని సీఎం పేర్కొన్నారు.

రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో తొలిసారిగా ఒకేసారి 28 సబ్ స్టేషన్లకు ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ ట్రాన్స్‌కో) శ్రీకారం చుట్టింది. సీఎం జగన్ వర్చువల్ విధానంలో 16 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన, 12 సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలు చేశారు.

దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలతో ఈరోజు మరో మంచి కార్యక్రమం చేస్తున్నాం. 14 జిల్లాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతం అవుతోంది. 28 సబ్ స్టేషన్లలో కొన్నింటిని ప్రారంభించాం, కొన్నింటి పనులు ప్రారంభిస్తాం. గోదావరి ముంపు ప్రాంతాల్లో చింతూరు, వీఆర్‌పురం, ఎటపాక తదితర ప్రాంతాల్లో ఇటీవలే తిరిగినప్పుడు సబ్‌స్టేషన్లే లేకపోవడంవల్ల ఇబ్బందులు వస్తున్నాయని అక్కడి వారు చెప్పారు. ఆ సమస్యను పరిష్కరిస్తూ.. అక్కడ సబ్‌స్టేషన్లను ఇవాళ ప్రారంభిస్తూ అక్కడి ప్రజలకు అంకితం చేస్తున్నాం. 12 సబ్‌స్టేషన్లను ఇవాళ ప్రారంభిస్తున్నాం, 16 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేస్తున్నాం.

ట్రాన్స్‌మిషన్ కెపాసిటీని విస్తరించుకుంటూ, నాణ్యమైన విద్యుత్ ప్రతి గ్రామానికి ప్రతిరైతుకు ఇచ్చే వ్యవస్థను క్రియేట్ చేస్తున్నాం. రైతులకు 9 గంటల పాటు పగటిపూటే

(మిగతా 2లో)



# బాల్య వివాహాలను నిర్మూలిద్దాం:గొండు సీతారాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలోని అన్నిప్రభుత్వ శాఖల సమన్వయంతో బాల్య వివాహాలు నిర్మూలిద్దామని రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా పరి షత్ సమావేశమందిరంలో రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ అధ్యక్షతన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, రెవెన్యూ, పోలీసు, విద్యా శాఖ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని జిల్లాలో బాల్య వివాహాలు నిలుపదలకు విశేష ప్రణాళికలతో అడుగులు వేస్తోందని అన్నారు. దీనిలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయ పరిచే క్రమంలో ఈ సమీక్షను చేపట్టామని తెలిపారు. ,బాల్య వివాహ రహిత జిల్లాగా విశాఖను తీర్చిదిద్దుతామన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జి.ఓ.నెంబర్ 31,39 లను అనుసరించి రాష్ట్రంలోని అన్ని సచివాలయల మహిళా సంరక్షణ కార్యదర్శులకు శక్తివంతమైన అస్త్రాలను అందించిందని అన్నారు. వార్డు వాలెంటీర్లను సమన్వయ పరుస్తూ ఆదిలోనే బాల్య వివాహాలు జరగకుండా సంభందిత కుటుంబ సభ్యులకు చట్టాలు, శిక్షలు ,అపరాధ రుసుములు, వివాహాలు జరిగితే తలెత్తే అన్ని రకాల అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ ప్రచారాన్ని ఉదృతం చేయాలని అన్నారు. చట్టాన్ని ధిక్కరించి బాల్య వివాహాలు జరిపితే పొక్సో కేసులు,ఇతర కేసులు నమోదుకు త్వరిత గతిన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.వెంకటేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీ హెల్పర్ మొదలుకొని జిల్లాలోని ప్రభుత్వ శాఖల సిబ్బంది, అధికారులను మమేక పరుస్తూ ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా అన్ని సచివాలయాల సిబ్బందికి అవగాహనా కార్యక్రమాలు చేపట్టి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు.

ముందుగా బాల్య వివాహాలు నిలుపుదలలో ప్రభుత్వ,ప్రభుత్వేతర సంస్థలు పాత్రపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు ఎం.ఆర్.ఎల్. రాధ, జిల్లా బాల్య సంరక్షణాధికారి బి.హెచ్. లక్ష్మి, డి.ఎల్.డి.ఓ కోఆర్డినేటర్ ఎం.ప్రసాద్, వివిధ మండలాల విద్యాశాఖాధికారులు దిశా పోలీసు అధికారి కాంతారావు, సి.డి.పి.ఓ. శ్రీలత, పి.ఒ.ఐ.సి.ఎం. రమేష్, పి.ఓ.ఎన్. ఐ.సి.బి. మమత, సోషల్ వర్కర్ ఆనంద్, చైల్డ్ లైన్ ప్రతినిధులు ప్రశాంత్, అంబేడ్కర్, వార్డుల సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

| | |
|---|---|
| బుధవారం 29-11-2023 | |
| శోభకృత్ నామ సంవత్సరము | |
| దక్షిణాయణం శరదృతువు | |
| కార్తీక మాసం | |
| తిథి | : బ. విదియ ప. 01.37 |
| నక్షత్రం | : మృగశిర ప. 02.28 |
| వర్జ్యం | : రా. 11.14 ల 12.37 |

పంచాంగం

## ప్రతి విజ్ఞప్తికీ నాణ్యమైన పరిష్కారం చూపిస్తాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు, విజ్ఞప్తికీ నాణ్యమైన పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విశాఖపట్టణం జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు జె. శ్యామలరావు పేర్కొన్నారు. అందరి సహకారంతో అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సమన్వయ కృషి చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తప్పులతో కూడిన జాబితాలను రూపొందిస్తున్నారని, కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని భాజపా నేత విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. కొన్ని చోట్ల అర్హత ఉన్నప్పటికీ ఓట్లను తొలగిస్తున్నారని, మరికొన్ని చోట్ల డెత్ సర్టిఫికేట్ లేదనే కారణంతో మరణించిన వారి ఓట్లను తొలగించటం లేదని వివరించారు. ఫొటోలు తప్పుగా వస్తున్నాయని, ఒకరి పేరుమీద బహుళ ఓట్లు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. అందరిలో ఆందోళన నెలకొందని పరిస్థితులను చక్కదిద్దాలని పల్లా శ్రీనివాసరావు విజప్తి చేశారు. ఒకే కుటుంబంలోని ఓటర్లకు వేర్వేరు చోట్ల పోలింగ్ కేంద్రాలను కేటాయించారని పరిశీలకుల దృష్టికి తీసుకొచ్చారు.

వీటిపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఓటర్ల జాబితా పరిశీలకులు జె. శ్యామలరావు స్పందిస్తూ రాజకీయ పార్టీల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు తప్పకుండా పరిష్కారం చూపిస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తమ పరిధిలో ఉండే అంశాలకు తక్షణమే చర్యలు తీసుకుంటామని, లేని పక్షంలో కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతులు తీసుకుంటామని బదులిచ్చారు. అందరి సహకారంతో ముందుకు వెళ్తామని, పారదర్శక విధానాలు అవలంబిస్తూ కచ్చితమైన జాబితాను రూపొందిస్తామని పేర్కొన్నారు.

ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున మాట్లాడుతూ ఇప్పటి వరకు రాజకీయ పార్టీల నుంచి వచ్చిన వినతులపై తీసుకున్న చర్యల గురించి వివరించారు. జిల్లా ఓటర్ల జాబితా రూపకల్పన, ప్రత్యేక క్యాంపులు, అవగాహన శిబిరాల గురించి వెల్లడించారు. 26.10.2023 నాటికి జిల్లాలో 19,15,682 మంది ఓటర్లు ఉండగా డ్రాఫ్ట్ వెరిఫికేషన్ తర్వాత 26.11.2023 నాటికి 19,15,316కు చేరుకున్నారని వివరించారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో మెరుగైన పనితీరు కనబరుస్తున్నారని, కచ్చితమైన జాబితా రూపొందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. తాజా సమావేశంలో తమ దృష్టికి తీసుకొచ్చిన వినతులపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ, గణబాబు, వైకాపా, తెదేపా, జనసేన, భాజపా, సీపీఎం, ఆప్, బీఎస్పీ తదితర పార్టీల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలతో యువత ముందుకు సాగాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ భౌతికశాస్త్ర విభాగంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విభాగంలో, విశ్వవిద్యాలయంలో వసతులను పూర్తిస్తాయిలో సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని సూచించారు. భౌతికశాస్త్రంలో పరిశోధనలు చేసే దిశగా ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాస రావు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీకి పొంచివున్న సూపర్ సైక్లోన్



**అమరావతి:** బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అండమాన్ నికోబార్ ద్వీప సముదాయం-థాయ్‌లాండ్ దక్షిణ ప్రాంతం గగనతలంపై ఏర్పడిన ఈ ఉపరితల ఆవర్తనం వచ్చే 29వ తేదీ నాటికి అల్పపీడనంగా మారుతుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. క్రమంగా ఇది- తుఫాన్‌గా మారడానికి అనుకూల పరిస్థితులు నెలకొని ఉన్నాయి పేర్కొంది.

డిసెంబర్ 1వ తేదీ నాటికి తుఫాన్‌గా ఆవిర్భవిస్తుందని ఐఎండీ అంచనా వేసింది. క్రమంగా అండమాన్ నికోబార్ ద్వీపానికి పశ్చిమ- వాయవ్య దిశగా కదులుతుందని, డిసెంబర్ 4 లేదా 5 తేదీల్లో ఏపీ తీరానికి సమీపిస్తుందని వివరించింది. దీని ప్రభావం ఈ నెల 1వ తేదీ నుంచి ఏపీ సహా తెలంగాణలోని పలు జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఈ తుఫాన్‌కు మిఛౌంగ్ అని పేరు పెట్టారు. మయన్మార్ ఈ పేరును సూచించింది. ఈ ఏడాదిలో బంగాళాఖాతంలో ఏర్పడబోయే నాలుగో తుఫాన్ ఇదే అవుతుంది. హిందూ మహా సముద్రంలో ఇప్పటివరకు ఆరు తుఫాన్లు ఏర్పడ్డాయి.

ఈ తుఫాన్ ప్రభావంతో ఇప్పటికే అండమాన్ నికోబార్‌లో అతి భారీ వర్షాలు కురుస్తోన్నాయి. వర్ష తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భారత వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది కూడా. మరో 48 గంటల పాటు వర్షాలు పడొచ్చని తెలిపింది. చేపలవేటకు వెళ్లకూడదని మత్స్యకారులను హెచ్చరించింది.

ఇదివరకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో చెదురుమదురుగా వర్షాలు పడ్డాయి. ఏపీలోని పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, కడప, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదైంది.

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చెదురుమదురుగా వర్షం కురిసింది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపాతం నమోదైంది.

హైదరాబాద్ సహా తెలంగాణ ఉత్తర ప్రాంతంలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి.

## పాకిస్తాన్ సహా మూడు దేశాలను వణికించిన పెను భూకంపాలు

పోర్ట్ మోర్స్‌బై: పాకిస్తాన్ సహా మూడు వేర్వేరు దేశాల్లో వరుస భూకంపాలు సంభవించాయి. వాటి తీవ్రత కూడా ఆందోళనకర స్థాయిలో నమోదయింది. కొన్ని చోట్ల భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఇందుల ఒకటి ద్వీపదేశం కావడం వల్ల సునామీ హెచ్చరికను సైతం జారీ చేశారు అధికారులు. ఆ తరువాత ఉపసంహరించుకున్నారు. పాకిస్తాన్, టిబెట్, పపువా న్యూగినియాల్లో ఈ తెల్లవారు జామున ఈ భూకంపాలు సంభవించాయి. పాకిస్తాన్‌లో ఈ తెల్లవారు జామున 3.38 నిమిషాలకు భూమి ప్రకంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.2గా నమోదైంది. పాకిస్తాన్ ఉత్తర ప్రాంతంలో పెషావర్ సమీప ప్రాంతాన్ని భూకంప కేంద్రంగా గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ తెలిపింది.

ఆ తరువాత సరిగ్గా అయిదు నిమిషాలకు అంటే 3:45 గంటలకు



టిబెట్‌లో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.0గా నమోదైంది. దీని తీవ్రత అటు నేపాల్‌లోనూ కనిపించింది. టిబెట్- నేపాల్ సరిహద్దుల్లో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ప్రాణ, ఆస్తినష్టం సంభవించిన సమాచారం లేదు.

ద్వీపదేశం పపువా న్యూగినియాలో ఇంతకంటే అధిక తీవ్రతతో భూకంపం చోటు చేసుకుంది. భారత కాలమానం ప్రకారం తెల్లవారు జామున 3:16 నిమిషాలకు భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.5గా నమోదైంది. ఉత్తర తీరప్రాంతంలో గల పసిఫిక్ ఐలండ్ స్టేట్, ఈస్ట్ సెపిక్ ప్రావిన్స్ రాజధాని వెకాక్ టౌన్‌కు ఈశాన్య దిశగా 20 కిలోమీటర్ల దూరంలో గల ప్రాంతాన్ని భూకంప కేంద్రంగా గుర్తించారు.

తీరప్రాంత నగరం కావడం భూకంప తీవ్రత 6.5 వరకు నమోదు కావడంతో అధికారులు సునామీ హెచ్చరికలను జారీ చేశారు. 20 నిమిషాల అనంతరం వాటిని ఉపసంహరించుకున్నారు. పపువా న్యూ గినియాలో భూకంపాలు సాధారణమే. రింగ్ ఆఫ్ ఫైర్‌లో ఉండటం వల్ల తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి గానీ ఈ సారి దీని తీవ్రత అధికంగా ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# (మొదటి పేజీ తరువాయిలు)

## కేంద్ర ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు కావాలి

కోరారు.వైద్య ఆరోగ్యంపై సమీక్షించిన ఆమె ఆరోగ్య శ్రీ కార్డులు అందరికీ ఉన్నప్పటికీ, ఆ కార్డుల ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం పొందడం తెలియక చాలా మంది ప్రభుత్వ ఆసుపత్రులకే పరిమితం అవుతున్నారని అన్నారు. కావున ఆరోగ్య శ్రీ ట్రస్ట్ రిఫరల్ ఆసుపత్రుల వివరాలు అందరికి తెలియజేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, వాటికి అనుబంధంగా కొనసాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలును ఈ సమీక్ష ద్వారా తెలుసుకోవడం జరిగిందని అన్నారు. ఈ సమీక్ష ద్వారా అధ్యక్షురాలు చేసిన ఆదేశాలు, సలహాలు, సూచనలు తు.చ తప్పక పాటించాలని పేర్కొన్నారు. ఈ సమావేశం ఇకపై ప్రతి మూడు మాసాలాకు ఒకసారి నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఛైర్ పర్సన్ కు హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు సూచించిన సలహాలను కమిటీ పరిగణలోకి తీసుకొని, వచ్చే సమావేశానికి చేపట్టిన చర్యలతో సంబంధిత అధికారులు హాజరుకావాలని స్పష్టం చేశారు.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం. పోలినాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఇ.సందీప్, జిల్లా అటవీ శాఖాధికారి అనంత్ శంకర్, గనుల శాఖ ఉప సంచాలకులు డా. డి.ఇ.వి.ఎస్. ఎస్.ఎన్.రాజు, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త బి.శ్రీనివాస రావు,పంచాయతీ రాజ్, వ్యవసాయం, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు స్కిల్ కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

కండీషన్లు కొనసాగుతాయని స్పష్టం చేసింది. స్కిల్ కేసు గురించి బయట చంద్రబాబు ప్రకటనలు చేయటానికి వీల్లేదని పేర్కొంది. అదే విధంగా కేసు వివరాల పైన బహిరంగంగా ప్రకటనలు చేయవద్దని స్పష్టం చేసింది.

**చంద్రబాబుకు నోటీసులు :** స్కిల్ కేసులో 17 ఏపై జడ్జిమెంట్ వచ్చిన తరువాత చంద్రబాబు బెయిల్ రద్దు కేసు వింటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇరు పక్షాలూ స్కిల్ కేసు గురించి బహిరంగంగా వ్యాఖ్యానాలు చేయరాదన్న సుప్రీంకోర్టు ధర్మాసనం..రాజకీయ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి చంద్రబాబుకు అనుమతి ఇచ్చింది.

ఇక, సీఐడీ దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటీషన్ లో చంద్రబాబుకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల 11న ఈ కేసు మరోసారి విచారణకు రానుంది. ఇక..ఇదే స్కిల్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటీషన్ పైన విచారణ పూర్తయింది. తీర్పు వెల్లడి కావాల్సింది. చంద్రబాబు పైన కేసుల్లో మొత్తంగా ఈ తీర్పు కీలకం కానుంది.

## నేవీ డే వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని నగరంలో ఐదు చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. బీచ్ రోడ్డులోని విశ్వప్రియ హాలు, ఏయూ గ్రౌండ్స్ వద్ద వాహనాల పార్కింగ్కు ఏర్పాట్లు చేయాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని వీఎంఆర్డీఏ సెక్రటరీని ఆదేశించారు. బీచ్ వద్ద లైఫ్ గార్డులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. నేవీ డే రోజున డ్రోన్లు, గాలిపటాలు ఎగుర వేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. వీక్షకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రాకపోకలు సాగించేందుకు అనువుగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమృద్ధిగా తాగునీరు అందుబాటులో ఉంచాలని, బయో టాయిలెట్స్ సమకూర్చాలని సూచించారు. క్రిటికల్ కేర్ అంబులెన్సును, రెండు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. బీచ్ సమీపంలో ఉన్న ఏపీఐఐసీ స్థలంలో వీఐపీ పార్కింగ్ ఏర్పాటు చేయాలని, అక్కడ నుంచి నేరుగా బీచ్ రోడ్డులోకి వీఐపీలు చేరుకునే విధంగా తాత్కాలిక ద్వారాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

నేవీ, పోలీసు అధికారులు సమన్వయం వహించి ప్రోటోకాల్ బాధ్యతలు నిర్వర్తించాలని ఆదేశించారు. మెయిన్ స్టేజ్ వద్ద సీటింగ్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే కమాండర్ ఇన్ చీఫ్ (సి-ఇన్ -సి) హౌస్ వద్ద ఎట్ హోమ్ ఉంటుందని అక్కడ కూడా సంబంధిత ఏర్పాట్లు చేయాలని, ఇక్కడ ఒక అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచాలని చెప్పారు. అతిథులకు, అధికారులకు, సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేసి, సంబరాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, నేవీ క్యాప్టన్ బీపీ శేఖర్, కమాండర్లు వైకే కిశోర్, ఉదయ్ అగర్వాల్, జగమేద్ సింఘ్, ఆర్ & బి ఎస్.ఈ. కాంతిమతి, వీఎంఆర్డీఏ సెక్రటరీ డి. కీర్తి, డీఎం & హెచ్వో పి. జగదీశ్వరరావు, జీవీఎంసీ సీఈ బి.రవి కృష్ణ రాజు, ఏడీసీ శ్రీనివాసరావు, ఎస్.ఈ. వేణుగోపాల్, సమాచార పౌర సంబంధాల శాఖ జేడీ వి. మణిరామ్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందివ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యం: సీఎం

ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న ఉద్దేశంతో అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి శ్రీకారం చుట్టాం. రూ.1700 కోట్ల తో ఫీడర్లను ఏర్పాటుచేసి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తున్నాం. ఉచిత విద్యుత్‌ను స్థిరంగా ఇవ్వడానికి రూ.2.4లకే యూనిట్ ధరతో సెకీతో ఒప్పందం చేసుకున్నాం. మరో 25 సంవత్సరాలపాటు రైతులకు ఎలాంటి ఢోకా లేకుండా ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. దీనివల్లరాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గుతుంది" సీఎం వివరించారు.

"దాదాపు రూ.3099 కోట్లతో సబ్‌స్టేషన్లకోసం ఖర్చుచేస్తున్నాం, ఇప్పటికే కొన్నింటిని ప్రారంభించాం. మరికొన్నింటి పనులు ప్రారంభిస్తున్నాం. రూ. 3400 కోట్లతో 850 మెగావాట్ల సోలార్ పవర్‌కు శ్రీకారం చుడుతున్నాం. 6500 కోట్ల పెట్టుబడి పెడుతున్నాం. అవేరా స్కూటర్స్ తయారీ సంస్థకు శ్రీకారం చుడుతున్నాం. ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించింది. లక్ష స్కూటర్ల ఉత్పత్తి దిశగా సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. 100 మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఉన్నాయి.

తాజా పెట్టుబడి వల్ల అదనపు ఉద్యోగాలు వస్తాయి. 28 సబ్ స్టేషన్లలో 200 మందికి ఉద్యోగావకాశాలు వస్తున్నాయి. 850 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు వల్ల 1700 ఉద్యోగాలు వస్తున్నాయి. హెచ్‌పీసీఎల్‌తో రూ.10 వేల కోట్ల పెట్టుబడికి ఒప్పందం పెడుతున్నాం. సోలార్,విండ్, పీఎస్పీ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను వీరు పెడుతున్నారు. దాదాపుగా 1500 మందికి ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయి. కాలుష్యరహిత విద్యుత్ రాష్ట్రానికి మేలు చేస్తుంది. పలు విద్యుత్ ప్రాజెక్టులను ఈరోజు ఇక్కడి నుంచి ప్రారంభిస్తూ.. ఈ రంగంలో మరింత అభివృద్ధి సాధించే దిశలో అడుగులు ముందుకు వేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా, వర్చువల్‌గా పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను.

## ఓబిసి రిజర్వేషన్లకై కేంద్రప్రభుత్వానికి సిఫార్సు : జీవీఎల్

జీవీఎల్ గత 12 నెలలుగా కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ మరియు ఎన్‌సీబీసీ వద్దకు ఈ కులాల నేతల ప్రతినిధులను పలుమార్లు తీసుకెళ్లడం జరిగింది.

ఈ నేపథ్యంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు చొరవతో సెప్టెంబర్ 13న న్యూఢిల్లీలో ఎన్‌సీబీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా హియరింగ్ నందు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర అధికారులు, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీ జీవీఎల్ అలుపెరగక చేసిన ఈ తీవ్ర ప్రయత్నాల అనంతరం, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో నివసిస్తున్న తూర్పుకాపులు, కళింగ వైశ్యులు, శిష్టకరణాలు, సొండి మరియు అరవ వర్గాలను OBCల కేంద్ర జాబితాలో చేర్చాలని NCBC భారత ప్రభుత్వానికి ఈరోజే సిఫార్సు పంపింది.

**దశాబ్దాల తూర్పు కాపుల సమస్య పరిష్కారం**

తుర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ ఉన్నప్పటికీ అది కేవలం ఉత్తరాంధ్ర జిల్లాలకే పరిమితమైంది. దీనివలన ఇతర జిల్లాల్లోని తూర్పు కాపులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఈ సిఫార్సు వలన వారికి OBC రిజర్వేషన్లు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకు వర్తించబడతాయి. ఇది తుర్పుకాపుల రిజర్వేషన్ల విషయంలో చారిత్రాత్మకం.

'కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు మరియు కేంద్ర విద్యాసంస్థల్లో ఈ అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు సాధించడానికి ఎన్‌సిబిసి యొక్క ఈ సిఫార్సు ఒక పెద్ద ముందడుగు" అని ఎంపి జీవీఎల్ నరసింహారావు సమావేశం అనంతరం తెలియజేశారు. తన కోరిన వెంటనే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పై విషయంలో సానుకూలంగా వ్యవహరించినందుకు NCBC ఛైర్మన్ హన్స్‌రాజ్ అహిర్‌కు జీవీఎల్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన మహా నేత జ్యోతి రావు పూలే



నర్సారావు పేట: జ్యోతి రావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా జాతీయ బీసీ జన సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పండరీబాయి ఆధ్వర్యం లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండరీబాయి మాట్లాడుతూ సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసి అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి స్త్రీలకు మొట్ట మొదటిసారిగా పాఠశాలలు ప్రారంభించి స్త్రీల ఆత్మగౌరవాన్ని కాపాడిన మహానేత జ్యోతిరావు పూలే అని అన్నారు.. అణగారిన కులాలకు ప్రస్తుతం బీసీ 147కులాలను సామాజికంగా ఆర్థికంగా ధనమానప్రాణాలను కాపాడిన మహానేత జ్యోతిరావు పూలే అని అమే పులే సేవలను గుర్తు చేశారు..ఈ కార్యక్రమంలో మహారాణా ప్రతాప్ సింగ్ బొందిలి అన్నదాన సమాజ్ ప్రెసిడెంట్ విజయ్ ప్రతాప్ సింగ్, సెక్రెటరీ బాబీ సింగ్ ,సాంబ సింగ్, చిన్న హనుమాన్ సింగ్ ,రాణా ప్రతాప్ సింగ్ ,జాతీయ బీసీ జన సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ వనిత పాల్గొని నివాళులు అర్పించారు

## ప్లాటినమ్ లవ్ బ్యాండ్లతో ప్రేమ పదిలం అరుదైన ప్రేమ ప్రత్యేక రిలేషన్ షిప్ కోసం

హైదరాబాద్, (విశాఖ సమాచారమ్): వివాహం అనేది జీవితంలో మరుపురాని ఘట్టం. వివాహ బంధంతో ఒక్కటయ్యేందుకు యువతీ యువకులు ఉవ్విళ్లూరుతుంటారు. ఈ అద్భుతమైన క్షణాలను అపురూపంగా మలుచుకునేందుకు 'పీజీఐ' ప్లాటినం లవ్ బ్యాండ్లు సిద్ధంగా ఉన్నాయి. ఈ శీతాకాలం వివాహాల కోసం ప్రత్యేక సేకరణ కలదు. ఈ అద్భుతమైన ప్లాటినమ్ బ్యాండ్లతో ఒకరికి ఒకరు సపోర్ట్ గా ఉండవచ్చు. జ్ఞాపకాలను పదిలపర్చుకోవచ్చు. అరుదైన ప్రేమను ప్లాటినమ్ తో మరింత బలపర్చుకోవచ్చు. నక్షత్రాల నుంచి పుట్టిన ప్లాటినం రెండు బిలియన్ సంవత్సరాల క్రితం ఉల్క క్రాష్ ద్వారా భూమిపైకి వచ్చింది. ఈ విలువైన లోహం ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రదేశాలలో మాత్రమే ఉంది. ఇది బంగారం కంటే 30 రెట్లు అధికం. ఇది అద్భుత సమయాలలో మరింత ఆకర్షణ పెంచుతుంది. కపుల్స్ ప్రేమ తాలుకా బలానికి ప్రతిరూపంగా ఉంటుంది. సహజమైన తెల్లటి మెరుపు ఎప్పటికీ అలానే ఉంటుంది. జంటలు తమ జీవితంలో ఒకరికి ఒకరు మంచి సమయాల్లోనే కాకుండా కఠినమైన సమయాల్లో కూడా తమ మధ్య ఉన్న బంధాన్ని పదిలపర్చుకుంటారు.

ప్లాటినం సహజసిద్ధమైన నాణ్యతను కలిగి ఉంటుంది. ఎందుకంటే, ఇది వజ్రాలు. ఇతర విలువైన రాళ్లతో ఉంటుంది. దాని సహజమైన తెలుపుతో ప్రకాశిస్తుంది. 95 శాతం స్వచ్ఛమైన, అరుదైన ప్లాటినమ్తో వేసిన ప్లాటినం లవ్ బ్యాండ్లు ప్రేమకు చిహ్నం. ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు గౌరవించుకోవడం, ఒకరి విజయాలలో సంతోషించడం, బాధ్యతలను సమానంగా పంచుకోవడం చాలా ముఖం, రిలేషన్ షిప్ ఎప్పుడూ ప్రత్యేకమైనదే. ప్రత్యేక క్షణాలను, వార్షికోత్సవాలను ప్రత్యేకంగా జరుపుకోవాలి. రిలేషన్ షిప్ ప్రయాణంలో ప్రతి మైలురాయి విలువైనది. ప్రతిష్టాత్మకమైనది. సంవత్సరం ఎండ్ అవుతున్నప్పుడు ఈ బంధాన్ని మరింత బలపర్చులోవాలి. అందుకు ప్లాటినం లవ్ బ్యాండ్ల తాజా సేకరణ ఎంచుకోవడం ఉత్తమ ఎంపిక అవుతుంది.

ప్లాటినం లవ్ బ్యాండ్లు ఎదుటి వారి లోపాలలో గల అందాన్ని వెతికే మీ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తాయి.

## మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో అందరూ సంఘానికి సేవ చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ సమానత్వం, స్త్రీలకు విద్య లతోపాటు అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేశారని చెప్పారు. అందరికీ విద్య, సమాన హక్కుల కొరకు పోరాడారు. ఆయన భార్య సావిత్రీ బాయి పూలే ఆయనకు తోడుగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఇన్చార్జి జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే.సురేష్ కుమార్, ఏ బి సి డబల్యుఓలు జి నాగేశ్వరరావు పి. చాముండేశ్వరరావు, హెచ్ డబ్ల్యుఓల సంఘ అధ్యక్షులు ఎస్. సత్యనారాయణ కార్యదర్శి పీకేపీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్య శాఖాధికారి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు, 1 టౌన్ పట్టణ ఆరోగ్య కేంద్రంను సందర్శించి అక్కడ సిబ్బంది తో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించారు. అపోలో హాస్పిటల్ వారు నిర్వహిస్తున్న కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ను సందర్శించి, అక్కడ పేషెంట్ లతో మాట్లాడుతూ కేన్సర్ అనేది మొదట్లోనే గుర్తించుట వలన నిర్మూలించవచ్చు అని తెలియచేసారు. ముఖ్యంగా స్త్రీలలో రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్, ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయని, మగ వారిలో ఊపిరితిత్తుల కేన్సర్, గొంతు కేన్సర్, ప్రోస్టేట్ కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని కనుక అనుమానం ఉన్నవారు అందరు కూడా స్క్రీనింగ్ చేయించుకోవాలని తెలియచేసారు. పక్కనే గల 1 టౌన్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ సిబ్బంది తో సమీక్ష నిర్వహించారు. గర్భిణీలను గుర్తించి టి.టి. అందచేయాలని, బర్త్ ప్లానింగ్ గురించి, మరియు హై రిస్క్ గర్భిణీలను గుర్తించి డాక్టర్స్ సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు మరియు పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలని తెలియ చేశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సందర్శన కి వెళ్ళినప్పుడు మూవ్మెంట్ రిజిస్టర్ లో వివరాలు నమోదు చేసి వెళ్ళవలెను అని ఆదేశించారు.

ఈ సందర్శన లో డా.నళిని, వైద్యాధికారి, ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది, MPHEO బి.నాగభూషణం పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక భేటీ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర సమాచార కమీషనర్ పి.శామ్యూల్ జొనాథన్ ఈ రోజు సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ నాక్ గ్రేడింగ్లో 3.74 స్కోర్ సాధించడం పట్ల ఏయూ పూర్వ విద్యార్థిగా పి.శామ్యూల్ జొనథన్ అమితమైన సంతోషం వ్యక్తం చేశారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. దేశంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో ఒకటిగా ఏయూ నిలవడం గర్వకారణమన్నారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధిని, విద్యార్థి కేంద్రంగా చేస్తున్న నూతన కార్యక్రమాలను రిజిస్ట్రార్ స్వయంగా తెలియజేశారు. ఈసందర్భంగా సమాచార కమీషనర్ శామ్యూల్ జొనాథన్కి ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పుష్పగుచ్చం అందించారు.

## జ్యోతిరావు పూలే కాక్షించిన సమ సమాజ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



కాకినాడ, (విశాఖ సమాచారమ్): మహాత్మా జ్యోతీరావ్ పూలే కాక్షించిన సమ సమాజ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కోరారు.

మహాత్మా జ్యోతీరావ్ పూలే వర్ధంతి పురస్కరించి మంగళవారం ఉదయం స్థానిక జిజిహెచ్ సెంటర్ లోని ఆయన విగ్రహానికి జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, శాశన మండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, కాకినాడ అర్బన్ ఎఎంసి చైర్ పర్సన్ పసుపులేటి వెంకట లక్ష్మి, అయ్యారక కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆవాల రాజేశ్వరి పలువురు ప్రముఖులు పూలమాలలు అలంకరించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ స్వేచ్ఛా, సమానత్వంతో కూడిన సమాజం కోసం ఉద్యమం సాగించిన జ్యోతీరావు పూలే గొప్ప సంస్కర్త అని కొనియాడారు. ఆయన కృషి వల్లే తదుపరి కాలంలో అణగారిన ప్రజల గౌరవం, హక్కులకు పరిరక్షణ పట్ల సమాజ దృక్పథంలో మంచి మార్పు వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ బడుగు వర్గాలు, ముఖ్యంగా మహిళలు విద్య ద్వారానే సాధికరత సాధించగలరని, ఆ దిశగా కృషి చేసిన మహనీయునిగా జ్యోతీరావ్ పూలే ను కొనియాడారు. ఆయన ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలు, మహిళల అభ్యున్నతికి, సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి నౌడు రాజేశ్వరి, బిసి కార్పొరేషన్ అద్దంకి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డివి రమణమూర్తి, బిసి సంక్షేమ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ఓటు నమోదు చేసుకొని తప్పక ఓటు వేయాలి




అనకాపల్లి/ఎలమంచిలి, (విశాఖ సమాచారమ్): 18సం.లు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని, ప్రతి ఎన్నికలలో ఓటు వేయాలని సీప్ నోడల్ అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ ఏ. మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎలమంచిలి లో ఓటు నమోదు పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయంలో వోటర్గా నమోదు కావడం, ఓటు హక్కు వినియోగించుకోవడం భారత పౌరులుగా మన బాధ్యత అని చెప్పారు. ఓటును సద్వినియోగం చేసుకున్నట్లయితే ప్రజాభాగస్వామ్యం లేని నాయకత్వం పరిపాలించవలసి వస్తుందన్నారు. విద్యార్థిని విద్యార్థులచే ఓటు నమోదు చేయించారు. ఓటు నమోదు పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు, డిటి, బిఎల్ఓ లు, పూర్ణస్థాయి వివేకానంద గీతాంజలి డిగ్రీ కళాశాలల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డిసెంబరు నెల జగనన్నకు చెబుదాం షెడ్యూలు విడుదల

విజయనగరం: జిల్లా అధికారులతో మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల కార్యక్రమం నిర్వహణకు సంబంధించి డిసెంబరు నెలకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విడుదల చేశారు. దీనిప్రకారం డిసెంబరు 6న రేగిడి ఆమదాలవలస, 13న సంతకవిటి, 20న గరివిడి, 27న జామి మండలాల్లో జరిగే వినతుల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్తోపాటు జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి వినతుల స్వీకరణ చేపడతారు. జిల్లా అధికారులంతా తమశాఖల మండల అధికారులతోపాటు తమకు ఆ మండలం నుంచి అందిన వినతుల పరిష్కార నివేదికల తో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ఆయా మండలాల్లో ముందస్తుగా గ్రామాల ప్రజలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఆయా మండలాల ఎంపిడిఓలు, తహశీల్దార్లు సంయుక్తంగా ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

## 3 లక్షల మంది గృహా, వ్యవసాయ, ఆక్వా, పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా: జిల్లా కలెక్టర్



కాకినాడ, (విశాఖ సమాచారమ్): హంసవరంలో నూతనంగా నిర్మిస్తున్న 132/33 కేవి విద్యుత్ ఉప కేంద్రం ద్వారా తుని, తొండంగి, శంఖవరం మండలాల్లోని 3 లక్షల మంది గృహ, వ్యవసాయ, ఆక్వా, పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుందని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు.

మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి తాడిపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్రంలో 620 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 12 విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం, 2,479 కోట్ల నిధులతో మరో 16 సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలను వర్చ్యువల్ విధానంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన కాకినాడ జిల్లా, తుని మండలం, హంసవరంలో 24 కోట్ల 64 లక్షల వ్యయంతో 132/33 కవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శంఖుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా, ట్రాన్స్కో, ఈపిడిసిఎల్ అధికారులతో కలిసి కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలు నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కి హంసవరం సబ్ స్టేషన్ శంకుస్థాపన నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూలగా ఉన్న తొండంగి మండలానికి ప్రస్తుతం సుదూరంలో ఉన్న పిఠాపురం, ప్రత్తిపాడు, పాయకరావు పేట 132 కేవీ ఉప కేంద్రాల నుండి విద్యుత్ సరఫరా జరుగుతోందని, అందువల్ల లో ఓల్టేజి, అంతరాయాల సమస్యలు ఎదురౌతున్నాయన్నారు. నూతనంగా దగ్గరలోనే తుని మండలం హంసవరంలో నిర్మిస్తున్న 132/33 కవి విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా తొండంగి మండలంతో పాటు తుని, శంఖవరం మండలాల వినియోగదారులకు కూడా మెరుగైన విద్యుత్ సరఫరా అంది లో ఓల్టేజి సమస్యకు శాశ్వత పరిస్కారం లభించనుందని తెలిపారు. ఈ సబ్ స్టేషన్ నిర్మాణం వచ్చే మార్చి నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కలెక్టర్ ట్రాన్స్కో అధికారులను కోరాడు. జిల్లాలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసే ప్రణాళిక క్రింద కాకినాడ దుమ్ములపేట, శంఖవరంలలో కొత్త సబ్ స్టేషన్లు ప్రతిపాదించి అవసరమైన స్థలాలు కేటాయిస్తున్నామన్నారు. ప్రతి వారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో పాతబడిన, ఒరిగిన విద్యుత్ స్థంబాల మార్పుకు ప్రజల నుండి తరచుగా అర్జీలు అందుతున్నాయని, వాటిపై తక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అలాగే జగ్గంపేట, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో నివాసాలపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్న వార్తలు పత్రికలలో వస్తున్నాయని వాటిని చక్కదిద్దేందుకు అవసరమైన సత్వర దర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎపి ట్రాన్స్ కో ఎస్ఈ ఏ. గురుబాబు, ఈఈ జె.రామారావు, కాకినాడ డిఈ జి.ప్రసాద్, జగ్గంపేట ఈఈ కె.రత్నాలరావు, హంసవరం సర్పంచ్ ఆర్. మేరీ అవినాష్, ట్రాన్స్కో, ఈపిడిసిఎల్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నాడు.

## శివ థాపా, అమిత్ పంఘల్ 7వ ఎలైట్ పురుషుల జాతీయ బాక్సింగ్ ఛాంపియన్షిప్లో విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించారు



న్యూఢిల్లీ: ఆరుసార్లు ఆసియా ఛాంపియన్షిప్ పతక విజేత శివ థాపా (63.5 కేజీలు) మరియు 2019 ప్రపంచ ఛాంపియన్షిప్లో రజత పతక విజేత అమిత్ పంఘల్ (51 కేజీలు) షిల్లాంగ్లో జరుగుతున్న 7వ ఎలైట్ పురుషుల నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్షిప్లో మూడో రోజు విజేతగా తమ ప్రచారాన్ని ప్రారంభించారు.

అస్సాంకు ప్రాతినిధ్యం వహిస్తున్న శివ అభినాష్ జమ్వాల్పై ఆధిపత్యం చెలాయించడం ప్రారంభించాడు, అయితే బౌట్ పురోగమిస్తున్న కొద్దీ, హిమాచల్ ప్రదేశ్కు చెందిన బాక్సర్ అద్భుతంగా పునరాగమనం చేసాడు మరియు రిఫరీలను ఆకట్టుకునేలా ప్రతి పాయింట్కి శివ వర్క్ చేశాడు. బౌట్ అంతటా గట్టి పోటీని ఎదుర్కొంది, అయితే అత్యంత అనుభవజ్ఞుడైన శివ తన ప్రత్యర్థిని 4-3 స్ప్లిట్ డెసిషన్ విన్లో అధిగమించడానికి ఆట యొక్క కీలక క్షణాల్లో తన ప్రశాంతతను కొనసాగించాడు. మంగళవారం జరిగే రౌండ్ ఆఫ్ 16 క్లాష్లో కర్ణాటకకు చెందిన సంతోష్ హెచ్కేతో తలపడనున్నాడు.

మహారాష్ట్రకు చెందిన శివాజీకి వ్యతిరేకంగా SSCB తరపున ఆడుతున్న అమిత్, ఎప్పటిలాగే నిశ్చయించుకున్నాడు. 28 ఏళ్ల అతను పంచ్లు విసరడానికి వెనుకాడలేదు, అతని ప్రత్యర్థి క్లూలెస్గా కనిపించడంతో సౌత్పావ్కు తన కదలికలతో ప్రయోగాలు చేయడానికి తగినంత అవకాశం ఇచ్చాడు. అమిత్ 5-0 ఏకగ్రీవ నిర్ణయ విజయంతో బౌట్ను ముగించాడు. అతను ఇప్పుడు రౌండ్ ఆఫ్ 16 క్లాష్లో మంగళవారం పంజాబ్కు చెందిన జయశందీప్ సింగ్తో తలపడనున్నాడు.

హిమాచల్ ప్రదేశ్కు చెందిన టోక్యో ఒలింపియన్ ఆశిష్ కుమార్ (80 కేజీలు) తన ప్రత్యర్థి పంజాబ్కు చెందిన అర్ష్దీప్ సింగ్పై విజయం సాధించాడు. ఆశిష్ తన గేమ్లో అగ్రస్థానంలో ఉన్నాడు మరియు ఏకగ్రీవ నిర్ణయంతో విజయాన్ని సాధించడానికి ప్రొసీడింగ్స్లో ఆధిపత్యం చెలాయించాడు. మంగళవారం జరిగే రౌండ్ ఆఫ్ 16 పోరులో చండీగఢ్కు చెందిన నితీష్ కుమార్తో తలపడనున్నాడు

ఆర్ఎస్పిబి (రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్) తరపున ఆడుతున్న ఆసియా ఛాంపియన్షిప్ 2022 కాంస్య పతక విజేత గోవింద్ సహానీ (48 కేజీలు) త్రిపురకు చెందిన సయాన్ లోధ్కు చాలా మంచిదని నిరూపించాడు. గోవింద్ తన ప్రత్యర్థిని ఆశ్చర్యపరుస్తూ దూకుడు విధానంతో ముందుకు సాగడం ప్రారంభించాడు. కొద్దిసేపటికే గోవింద్ ఒక రౌండ్లో పోటీ తీర్పును నిలిపివేస్తూ రిఫరీతో గేమ్ను ముగించాడు. 16వ రౌండ్లో మంగళవారం హిమాచల్ ప్రదేశ్కు చెందిన విశాల్తో తలపడనున్నాడు.

13 వెయిట్ కేటగిరీల్లో మొత్తం 350 మంది బాక్సర్లు ఛాంపియన్షిప్లో పాల్గొంటున్నారు.

# 12వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 12వ వార్డు పిఎస్ నెం. 48,57,,53, ల లో బా బు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారంటి కార్యక్రమంలో ఈశ్వర దేవీ నగర్, పెదగదిలి, సాలిపేట, ఏరియాలో చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్,సంక్షేమ పథకాలను వివరిస్తూ రాబోవు ఎన్నికలలో తెలుగుదేం పార్టీకి ఓటు వేసి, చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి ని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ఇంఛార్జి ఒమ్మి అప్పలరాజు, అద్యక్షుడు గాడి సత్యం, పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి పోలారవు,48,బూత్ కన్వీనర్ సంపంగి రాజు,57,బూత్ కన్వీనర్ మజ్జి నాగరాజు, 52, బూత్ కన్వీనర్,వాణపల్లి గణేష్,23,బూత్ కన్వీనర్ రాపర్తి గణపతి, వాసు, వేంకట నాయుడు, పనింద్రలు పాల్గొన్నారు.

# దేశానికి మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దేశానికి మహాత్మా జ్యోతిరావు పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ డా.ఏ మల్లికార్జున పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబా పూలె 133 వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక హొటల్ గ్రీన్ పార్క్ కూడలి వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా రెవెన్యూ అధికారి కె .మోహన్ కుమార్ తో కలసి కలెక్టర్ పూలమాలాంకరణ చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే 133 వ వర్ధంతి పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులు అర్పించడం జరుగుతోందని అన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు , అశా జ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. బీసీలతో పాటు సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని ఆయన అన్నారు. అట్టడుగు వర్గాల కష్టాలు ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. పూలే చూపిన దారిలో ఇప్పుడున్న పలు ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని అన్నారు. మహాత్మ జ్యోతి రావు పూలే బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటాలు చేసి ప్రతి మహిళకు ఉన్నతమైన చదువులు చదవాలనే లక్ష్యంతో పని చేశారని ఆయన తెలిపారు.

మహిళల హక్కుల కోసం, వారికి విద్యా అవకాశాలు కల్పించడం కోసం పనిచేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన వెనుకబడిన వర్గాల సమానత్వం కోసం కృషి చేసారని కొనియాడారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం తమ జీవితాలను అంకితం చేశారని చెప్పారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కృషిచేసిన జ్యోతిభా పూలే మహనీయుడని కొనియాడారు. వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలలు స్థాపించారని చెప్పారు. బాలికల విద్యకు పూలే దంపతులు వేసిన పునాది, నేడు ఫలితాన్ని ఇస్తోందని, మహిళలు కూడా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అభివృద్ధి చెందుతున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రామారావు, సమాచార శాఖ ఆర్జెడి వి. మణిరామ్, బిసి సంక్షేమ శాఖ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ అర్. ప్రసాదరావు, బిసి సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ , బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరుగా చేరండి



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** ఓటరుగా చేరడం మన బాధ్యత అని రావికమతం మండల తాసిల్దారు మహేశ్వర రావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం గా ఏర్పడి ఓటు హక్కు కలిగి ఉండటం మన బాధ్యత అని ప్రతి ఒక్కరు ఓటరుగా చేరాలని ఇది మన విధి అని ప్రతి ఒక్కరూ గురుదరు బాధ్యతగా స్వీకరించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించడమే కాకుండా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా కూడా చేయాలంటూ తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా ఉన్న మన దేశానికి ఇది ఎంతో ముఖ్యమని ఈ హక్కు కలిగి ఉండడం ఎంతో గర్వకారణం అని తెలిపారు కార్యక్రమంలో విఆర్వోలు ఆర్ ఐ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కంపను కదిపిన బైడెన్

## కొత్త పర్మిట్ విధానంలో అనూహ్య సమస్యలు



ఆచితూచి అన్నట్లు నిర్ణయం తీసుకోవాల్సిన అంశంలో బైడెన్ సర్కారు అనుసరిస్తున్న తీరు అమెరికాలో కొత్త చిచ్చుకు కారణమవుతోంది. ఎంతో కాలంగా ఉన్న వలసదారులకు లభించాల్సిన వర్క్ పర్మిట్లకు భిన్నంగా.. కొత్తగా దేశానికి వచ్చే లాటిన్ అమెరికా వాసులకు జెట్ స్పీడ్ తో వలస పర్మిట్లు లభిస్తున్న వైనంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. అమెరికాలోని పాత వారికి.. కొత్త వారికి మధ్య పెరుగుతున్న అంతరం ఆ దేశానికి మంచిది కాదన్న మాట వినిపిస్తోంది. కొత్తగా జారీ చేస్తున్న వీసా విధానం కారణంగా బైడెన్ సర్కారు తేనె తుట్టెను కదిపినట్లు అయ్యిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బైడెన్ సర్కారు తీసుకున్న నిర్ణయాలతో ఇప్పటికే ఎన్నో ఏళ్లుగా అమెరికాలో ఉంటున్న వలసదారుల్లో ఆగ్రహం పెరగటమే కాదు.. కొత్తగా వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొనేలా చేస్తోంది. తాజాగా వాషింగ్టన్ లో జరిగిన భారీ ర్యాలీని పలువురు గుర్తు చేస్తున్నారు. మెక్సికో.. వెనెజువెలా.. కొలంబియా తదితర లాటిన్ అమెరికా దేశాల నుంచి అమెరికాకు వచ్చే వాలస వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. దీనికి తోడు కొత్త సమస్యలు అంతే వేగంగా పెరుగుతున్నాయి.

ఇలా వచ్చిన వలస శ్రామికులు అమెరికాలో పంట కోతల కోసం పండ్లు.. కూరగాయలు తెంపటం.. హొటళ్లలోనూ.. షాపుల్లోనూ.. భవన నిర్మాణంలోనూ పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇప్పుడు వచ్చిన సమస్య ఏమంటే.. అమెరికాలో దశాబ్దాల నుంచి ఉంటున్న వారికి వర్క్ పర్మిట్లు లభించటంలేదు. కానీ.. కొత్తగా వస్తున్న వలస కార్మికులకు మాత్రం వర్క్ పర్మిట్లు లభించటంపై ఆగ్రహంవ్యక్తమవుతోంది.

బైడెన్ సర్కారు అనుసరిస్తున్న తీరుతో.. వలసదారుల్లో విభేదాల్ని.. ఉద్రిక్తతల్ని పెంచుతోంది. అమెరికాలో దగ్గరి బంధువులు.. తెలిసిన వారు ఉంటున్నారని.. వారు తమను ఆదుకుంటారని వస్తున్న వారిని గతంలో వచ్చి ఉంటున్న వారు.. వీరిని పలుకరించని పరిస్థితి. బైడెన్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత సీబీపీ వన్ అనే యాప్ సాయంతో వర్క్ పర్మిట్లు సులువుగా లభించటమే కాదు.. జెట్ స్పీడ్ తో అనుమతులు వస్తున్నాయి.

సెప్టెంబరులో పని అర్హత పొందిన వారికి పంపిన తాజా సమాచారం 14 లక్షలమంది కావటం ఒక ఎత్తు అయితే.. దశాబ్దాల తరబడి అమెరికాకు వచ్చి పని చేస్తూ.. పన్నులు కడుతున్నవారికి మాత్రం వర్క్ పర్మిట్లు లభించకపోవటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొత్త వలసదారులకు ఆహారం.. ఆశ్రయం.. ఇతర వసతుల కల్పన కోసం బైడెన్ సర్కారు 140కోట్ల డాలర్లను మంజూరు చేయాలని పార్లమెంట్ ను కోరటం గమనార్హం. కొత్తగా వచ్చిన వారితోపాటు దశాబ్దాలుగా అమెరికాలోనే ఉంటున్న పాతవారికీ వర్క్ పర్మిట్ల జారీ చేయాలన్న డిమాండ్ అంతకంతకూ ఎక్కువై.. ఆందోళన దిశగా అడుగులు పడుతున్నాయి. మరేం జరుగుతుందో చూడాలి.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, అటువంటి గొప్ప వ్యక్తి ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని లివిశాఖ పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయ కర్త గౌరవనీయులు ఎంవివి సత్యనారాయణ అన్నారు. విశాఖ లాసన్స్ బే కాలనీ పార్లమెంటు సభ్యులు, విశాఖ తూర్పు నియోజకవర్గం వైసీపీ క్యాంపు కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకొని పూలే చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంవివి మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు కూడా సమాన విద్యనభ్యసించాలనే ఆలోచనతో పూణేలో మొట్టమొదటి సారిగా బాలికలకోసం ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటుచేసి ఎన్ని ఇబ్బందులొచ్చినా సరే విడవకుండా పాఠశాలను కొనసాగించిన ఘనత పూలేకు దక్కుతుందన్నారు. అలాగే కులాలకు అతీతంగా జీవన ప్రమాణాలను మెరుగు పరచుకొనేందుకు మనమంతా పాటుపడాలని పిలుపు నిచ్చారు. పూలే సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇన్చార్జులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు డైరెక్టర్లు వివిధ అనుబంధ సంఘాల నాయకులు,పార్టీ శ్రేణులు మహిళలు అభిమానులు పాల్గొన్నారు.

# ఇన్నర్ వీల్ క్లబ్ విశాఖపట్నం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కి కంప్యూటర్ వితరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వున్న వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆఫీస్ కి ఈరోజు ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ 3020 ఇన్నర్ వీల్ క్లబ్ విశాఖపట్నం ఈ రోజు కంప్యూటర్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం డిస్ట్రిక్ట్ క్లబ్ చైర్మన్ శ్రీదేవి ప్రారంభించారు. ఇది బాలలలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టడానికి ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ బిమ్మి భాల, క్లబ్ సెక్రటరీత జి విజయలక్ష్మి, జిల్లా మాజీ ఛైర్మన్ కస్తూరిరెడ్డి, క్లబ్ కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ అనుపమ, కోశాధికారి రమాదేవి, ఉపాధ్యక్షులు రమా విద్యాసాగర్, కోశాధికారి విభా అగర్వాల్, ఇంటర్నేషనల్ సర్వీసు ఆఫీసర్ క్లబ్ ఐఎస్ఓ ఎం. లక్ష్మి, ఎడిటర్ శ్యామల పాల్గొన్నారు. వి.సి.సి జోన్ నాయకులు ఎ.మణి ఇన్నర్ వీల్ క్లబ్ కి ధన్యవాదములు తెలియజేశారు. వీసీసీ నుంచి కల్యాణి, భవాని, కనకారావు, సరోజిని, నాగమణి పాల్గొన్నారు.

# కార్మికులకు చేరువలో రెస్క్యూ టీం...



ఉత్తరాఖండ్ లోని సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను కాపాడేందుకు సహాయక బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఏదో ఒక రూపంలో ఎదురవుతున్న అడ్డంకులను అదిరోహించి వరుస మార్పులు చేసుకుంటూ సుమారు గత 17 రోజులు సహాయక చర్యలు శరవేగంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా చేపట్టిన సహాయక చర్యల్లో పురోగతి కనిపిస్తోంది.

అవును... ఉత్తరాఖండ్ లోని ఉత్తర్ కాశీ సిల్క్యారా సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను కాపాడేందుకు చేపట్టిన సహాయక చర్యల్లో పురోగతి కనిపిస్తోంది. నేలకు సమాంతరంగా చేపట్టిన పనులు ఆగిపోయిన చోట 12 మంది "ర్యాట్ హొల్ మైనర్లు" తవ్వకాలు చేపట్టారు. దీంతో ఇప్పటి వరకు 50 మీటర్లకు పైగా తవ్వకం పూర్తయినట్లు సహాయక బృందంలోని అధికారులు వెల్లడించారు.

దీంతో... సొరంగంలో చిక్కుకుపోయిన కూలీలను చేరుకోవాలంటే మరో 5 - 10 మీటర్ల తవ్వాల్సి ఉందని అంటున్నారు. అన్నీ అనుకూలంగా జరిగితే... నేటి సాయంత్రానికి రెస్క్యూ పనులు కీలక దశకు చేరుకుని గుడ్ న్యూస్ వినే అవకాశముందని చెబుతున్నారు.

కాగా... అంతకుముందు కార్మికులను రక్షించడం కోసం ఆగర్ యంత్రంతో దాదాపు 47 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సదరు యంత్రం విరిగిపోయి మధ్యలోనే చిక్కుకుపోయింది. దీంతో మ్యానువల్ డ్రిల్లింగ్ చేపట్టి.. యంత్రాన్ని దాని నుంచి తొలగించారు. ఆ తర్వాత "ర్యాట్ హొల్ మైనర్లు" సోమవారం రాత్రి నుంచి తవ్వకాలు ప్రారంభించారు.

ఈ "ర్యాట్ హొల్ మైనింగ్" బృందానికి చెందిన అనుభవజ్ఞులైన 24 మంది ఈ మాన్యువల్ డ్రిల్లింగ్ పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా తొలుత 800 మిల్లీమీటర్ల వ్యాసమున్న స్టీల్ పైపు నుంచి డ్రిల్లింగ్ మెషీన్ బ్లేడ్లను తొలగించి.. అదే మార్గంలోకి వెళ్లిన కార్మికులు.. సొరంగానికి మ్యాన్యువల్ గా రంధ్రం చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు దాదాపు 2 మీటర్ల మేర మాన్యువల్ డ్రిల్లింగ్ పూర్తయింది.

మరోవైపు టన్నెల్ పైభాగం నుంచి వెర్టికల్ డ్రిల్లింగ్ పనులు కూడా తదనుగుణంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా... 86 మీటర్లు తవ్వాల్సి ఉండగా.. మంగళవారం ఉదయం నాటికి 51 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రెస్క్యూ టీ నుంచి కార్మికులు కేవలం 5 మీటర్ల దూరంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ అయిదు మీటర్ల డ్రిల్లింగ్ పూర్తయితే కార్మికులను చేరుకోనున్నారని సమాచారం.

కాగా... సొరంగంలో 41మంది కార్మికులు గత 16 రోజులుగా సొరంగంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల వారు ఉంటున్న ప్రాంతం వద్దకు ఎండోస్కోపి తరహాలోని కెమెరాను పంపి వారితో మాట్లాడారు. దీంతో... కూలీలంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో అన్నీ అనుకూలంగా జరిగితే ఈ రోజు సాయంత్రం లోపు గుడ్ న్యూస్ వినొచ్చని చెబుతున్నారు.

# దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్న.. వినాయకుడి గుడి



**పరవాడ, (విశాఖ సమచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ పంచాయతీ పరవాడ బీసీ కాలనీలోని సామాజిక భవనం వద్ద ఉన్న వినాయకుడి దేవాలయం దాతలు సహాయానికి ఎదురుచూస్తు అసంపూర్తిగా పడి ఉంది. దశాబ్దకాలంగా ప్రారంభానికి నోచుకోలేదు. పదేళ్ల క్రితం ఇదే కాలనీకి చెందిన ఓ దాత చందాలు సేకరించి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. తన శక్తి మేరకు దేవాలయ నిర్మాణానికి నిధులు అందించారు. నిధులు కొరత కారణంగా అలయ నిర్మాణం సగంలో ఆగిపోయింది. సంవత్సరాలు గడుస్తున్నా ఆలయ నిర్మాణం పూర్తి కాకపోవడం పై కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో అది కాస్త శిథిలావస్థకు చేరుకునే దుస్థితి ఏర్పడింది. దాతల సహకారం అందిస్తే ఆలయ నిర్మాణం పూర్తి అవుతుందని కాలనీవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే ఆలయ నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోవడం పట్ల కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు,దాతలు సహకారం అందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఓట్ల కోసం ఇంటింటికి తిరిగే రాజకీయ నాయకులు అసంపూర్తిగా ఉన్న దేవాలయాలను కూడా పట్టించుకోవాలని కోరుతున్నారు. ప్రజల సొమ్ముతో గ్రామదేవతల పండుగల్లో సొంత డబ్బాలు కొట్టుకోవడానికి చూపించే శ్రద్ధ అసంపూర్తిగా ఉన్న ఆలయ నిర్మాణాల పై కూడా చూపిస్తే బాగుంటుందని కాలనీవాసులు కోరుతున్నారు. అవసరమైతే తాము కూడా చందాల రూపంలో నగదు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని కాలనీవాసులు చెప్పున్నారు.ఇప్పటికైనా నాయకులు స్పందించి ఆలయ నిర్మాణానికి ముందుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

# నాలుగో తరగతి పిల్లాడు జామెట్రీ కంపాస్ తో 108సార్లు దాడి!



అమానుష ఘటన చోటు చేసుకుంది. విన్నంతనే ఉలిక్కిపడేలా ఉన్న ఈ ఉదంతంలో.. నాలుగో తరగతి చదివే పిల్లాడు ఇంత అమానుషంగా వ్యవహరించటమా? అన్నది నమ్మలేని నిజంగా మారింది. పిల్లలు అన్న తర్వాత గొడవలు పడటం.. చిన్న చిన్న కొట్లాటలు మామూలే. కానీ.. తోటి విద్యార్థి మీద ఉన్న కోపంతో జామెట్రీ కంపాస్ తో 108 సార్లు విచక్షణరహితంగా పొడిచేసిన షాకింగ్ ఉదంతం మధ్యప్రదేశ్ లో చోటు చేసుకుంది.

ఇండోర్ నగరంలో జరిగిన ఈ ఉదంతం గురించి విన్నవారంతా ఆందోళన చెందుతున్నారు. ఇంటికి వచ్చిన తమ పిల్లాడు రక్తమోడుతూ రావటంతోఏం జరిగిందో తమకు అర్థం కాలేదని.. చివరకు పిల్లాడ్ని అడిగితే.. తన తోటి విద్యార్థి జామెట్రీ కంపాస్ తో 108సార్లు పొడిచినట్లుగా పేర్కొన్నాడు.అయితే.. క్లాస్ రూంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్ ఇచ్చేందుకు స్కూల్ యాజమాన్యం ఒప్పుకోవటం లేదని బాధిత పిల్లాడి తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి కోలుకుంటున్నాడు. ఈ ఉదంతంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. దాడి చేసిన విద్యార్థి.. బాధిత విద్యార్థి ఇద్దరు పదేళ్లలోపు వయసు వాళ్లే. కొంతకాలంగా చిన్నారుల్లో నేర ప్రవ్రతి పెరిగిపోతుందని.. ముఖ్యంగా పేరెంట్స్ ఈ విషయంలో ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

ఈ ఉదంతంపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై వెంటనే నివేదిక సమర్పించాల్సిన ఆదేశించింది. గొడవ జరిగిన సందర్భంలో పిల్లాడు ఇలా ప్రవర్తించాడని చెబుతున్నారు. నిందితుడైన విద్యార్థికి హింసాత్మక సన్నివేశాలు ఉండే వీడియో గేమ్స్ ఆడే అలవాటు ఉందా? నాలుగో తరగతి చదివే పిల్లాడిలో ఇంతటి హింసాత్మక తీరు ఎలా సాధ్యం? అన్నది ప్రశ్నగా మారింది. స్కూల్ సిబ్బందికి.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

# కొగుంట గ్రామంలో డ్రైనేజ్ పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ సూర్య కుమారి



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** మండలంలో కవగుంట గ్రామంలో డ్రైనేజీ పనులను సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు శనివారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల నుంచి డ్రైనేజీ సమస్యతో బాధపడుతున్న కవగుంట గ్రామ ప్రజలకు నేటితో ఇబ్బందులు తొలుగుతాయని సర్పంచ్ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్ర ఇబ్బంది గా ఉన్న కారణంగా చోడవరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో స్థానిక జడ్పీటిసి తలారి రమణమ్మ ఆదిమూర్తి జెడ్పి నిధులు నుండి 3 లక్షల రూపాయలు , ఎంపీపీ పైలరాజు మండల పరిషత్ నిధులు నుండి 3 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిని రొబ్బా లోవరాజు ఇంటి దగ్గర నుంచి చీకురు వెంకటరమణ ఇంటి వరకు సుమారు 120 మీటర్ల పొడవు గల డ్రైను నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే దీనికి ముందు ఐదు లక్షల రూపాయలు జి జి ఎం పి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టడం జరిగిందన్నారు. శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, మండల పరిషత్ అధ్యక్షులు పైలరాజు, జెడ్పిటిసి తలారి రవణమ్మ ఆదిమూర్తి, సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ , ఎంపీపీ పైలరాజు, జడ్పిటిసి తలారి రమణమ్మ ఆదిమూర్తి,కి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియపరిచారు. అదే విధంగా మా గ్రామాభివృద్ధికి రానున్న రోజుల్లో మరింత సహాయ పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ డైరెక్టర్ వెచ్చం చిన్న నాగరాజు, గ్రామ పెద్దలు రొబ్బాచిన కళ్యాణం దొర, రొబ్బా శ్రీనివాసరావు, పచ్చి కోర రాము, రాబ్బ దేవుళ్ళు, సమాల కళ్యాణం, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శించ వద్దని నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదేశించారు. ఓటరు నమోదు, తొలగింపు ప్రక్రియ పక్కాగా పూర్తి ఆదేశించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా సబ్ కలెక్టర్లు, తాహాశీల్దారులతో కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం -6, ఫారం-7, ఫారం -8 ల పై సమీక్షించారు.అరకు వ్యాలీ నియోజక వర్గం లో ఫారం -6 లు 740, పాడేరు నియోజక వర్గంలో 1936, రంపచోడవరం నియోజక వర్గంలో 465 వెరసి 3141 పెండింగిలో ఉన్నాయని రెండు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అరకు నియోజక వర్గంలో ఫారం -7లు 1224.అరకు నియోజక వర్గంలో 1220, రంపచోడవం నియోజక వర్గం 708 మొత్తం 2052 ఫారంలు పెండింగిలో ఉన్నాయని చెప్పారు. అరకు నియోజక వర్గంలో ఫారం 8లు 4515, పాడేరు నియోజకవర్గంలో 1805, రంపచోడవరం 1564 మొత్తం 7884 ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని రెండు రోజుల్లో పరిష్కరించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. 6,7,8 ఫారాలను త్వరగా పరిష్కరించే విధంగా బూత్ స్థాయి అధికారులను ఆదేశించాలని అన్నారు. ఫోటో గ్రాఫ్, డెమోగ్రాఫ్‌లకు సంబంధించి ఒకే విధంగా ఉన్న ఎంట్రీల వివరాలను సంబంధిత ఓటర్లకు పంపించి వారి నుండి ఫారం-7లను సేకరించి 15 రోజుల్లోగా సవరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 537 జీరో నంబరు గృహాలలో 9140 మంది ఓటర్లు ఉన్నారని వారి నుండి ఫారం 7లను సేకరించి సవరించాలని చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, పాడేరు, రంప చోడవం సబ్ కలెక్టర్లలు వి. అభిషేక్, శుభం బన్సల్, డి . ఆర్. ఓ. పి. అంబేద్కర్, కె. ఆర్. ఆర్ సి , ఎస్.డి.సి . మురళి, 22 మండలాల తాహాశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరేళ్ల బాబుకు హార్ట్ ఎటాక్.. ఢిల్లీ ఆసుపత్రిలో మృతి



గుండెపోటు.. ఒకప్పుడు వయసు పైబడిన వారికి, అరుదుగా మధ్యవయస్కులకు మాత్రమే వచ్చేది. గుండె పోటు కారణంగా చనిపోయే వారి సంఖ్య కూడా పెద్ద వయస్కులదే ఎక్కువగా ఉండేది. అయితే, మారిన జీవనశైలి, ఆహారపుటలవాట్లతో ప్రస్తుతం చిన్నా పెద్దా తేడా లేకుండా గుండెపోటు బారిన పడుతున్నారు. ఒక్కసారిగా కుప్పకూలి ఆసుపత్రిలో చేరుతున్న వారు కొందరైతే, కొంతమంది మాత్రం స్పాట్ లోనే కన్నుమూస్తున్నారు. తాజాగా ఢిల్లీలో ఓ ఆరేళ్ల బాలుడు గుండెపోటుతో చనిపోయాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడిని తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్పించారు.

చికిత్సతో కోలుకున్నట్లే కోలుకున్న బాలుడు.. తర్వాత మరోమారు జబ్బుబారిన పడ్డాడు. ఈసారి ఆసుపత్రిలో చేరి ఇంటికి తిరిగిరాలేదు. ఆ బాలుడి మరణానికి కారణం గుండెపోటేనని వైద్యులు నిర్ధారించారు. రక్త పరీక్షలో బాబు మయోకార్డిటిస్ వైరస్ బారిన పడినట్లు తేలిందన్నారు. మధ్యప్రదేశ్ లోని ఇండోర్ కు చెందిన బిజినెస్ మ్యాన్ రాహుల్ జైన్ కు ఒక్కడే కొడుకు.. ఆరేళ్ల విహాన్ జైన్ ఇండోర్ లోని ఓ కార్పొరేట్ స్కూలులో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఇటీవల విహాన్ అనారోగ్యానికి గురయ్యాడు. తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్పించడంతో కోలుకున్నాడు.

ఈ క్రమంలో ఫ్యామిలీ ఫంక్షన్ కోసం రాహుల్ తన కుటుంబంతో కలిసి ఢిల్లీ వెళ్లాడు. అక్కడ మరోసారి విహాన్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో బాలుడిని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ విహాన్ శనివారం రాత్రి గుండెపోటుకు గురై చనిపోయాడు. వైద్య పరీక్షల్లో విహాన్ కు మయోకార్డిటిస్ అనే వైరస్ సోకినట్లు గుర్తించామని డాక్టర్లు చెప్పారు. ఈ వైరస్ గుండె కండరాలపై ప్రభావం చూపుతుందని, కండరాల వాపునకు కారణమవుతుందని వివరించారు. దీంతో గుండెకు రక్తం సరఫరాలో అవాంతరాలు ఎదురవుతాయని, ఫలితంగా గుండె అకస్మాత్తుగా ఆగిపోతుందని డాక్టర్లు చెప్పారు.

# జూ ఎలుగు బంటి దాడిలో మరణించిన నగేష్ కుటుంబానికి 50లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

## న్యాయవిచారణ జరిపించాలి

### ఆర్‌కెఎస్‌వి కుమార్, సీఐటీయూ, జిల్లా ప్రధాన కార్యదర్శి


**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సోమవారం జూ పార్క్ ఎలుగు బంటి దాడిలో మరణించిన నగేష్ మృతిపై సమగ్రమైన న్యాయ విచారణ జరిపించాలని, మృతుని కుటుంబానికి 50 లక్షలు రూ నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు కేటాయించాలని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ జూ అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. జూ పార్క్‌లో ఏ విధమైన కార్మిక చట్టాలు అయిన కనీస వేతనాలు, సెలవులు వంటివి అమలు కావడం లేదన్నారు. జూ పార్క్‌కి విపరీతమైన ఆదాయాలు వస్తున్నా కనీస వేతనాలు లేవన్నారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందన్నారు.

గతంలో అనేక సార్లు జంతువుల దాడిలో గాయపడ్డ కార్మికులకు ఏ విధంగానూ యాజమాన్యం, ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. ఇటువంటి ప్రమాదాలకు యాజమాన్య నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్నారు. నగేష్ చనిపోయిన తరువాత కూడా చాలాసేపటి వరకు సమాచారం ఇవ్వకపోవడం, మీడియాను అనుమతించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నరు. తక్షణమే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగుచర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాము.

జూ లో కార్మికులకే కాకుండా పర్యాటకులకు కూడా రక్షణ లేకుండా ఉందని, పర్యాటకులకు, కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన నగేష్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. వారి కుటుంబానికి సిఐటియు అండగా వుంటుందని తెలియచేస్తున్నాము.

# సంపూర్ణ కార్తీక మహాపురాణం

## (నిత్య పారాయణం)



**పదునేడవరోజు పారాయణము**

**తృతీయాధ్యాయము**

**మళ్లా చెబుతున్నాడు సూతుడు:** పూర్వాధ్యాయంలో చెప్పినట్లు సత్యభామ, శ్రీకృష్ణునికి నమస్కరించి, 'ప్రాణేశ్వరా! కాలస్వరూపుడవైన నీకు సర్వకాలాలూ అవయవాలై అలరారుతూండగా - తిథులలో ఏకాదశీ, నెలలలో కార్తీకమూ మాత్రమే అంతటి ఇష్టమయినందుకు కారణమేమిటో సెలవీయవలసిందని కోరగా నవ్వు రాజిల్లేడు మోము వాడయిన నవనీత చోరుడిలా చెప్పసాగాడు. 'సత్యా! చక్కటి ప్రశ్ననే వేశావు. ఇది అందరూ కూడా తప్పనిసరిగా తెలుసుకోవలసిన విషయం, గతంలో పృథుచక్రవర్తి నారదుని ఇదే ప్రశ్న వేశాడు. అప్పుడు నారదుడు చెప్పిన దానినే ఇప్పుడు నీకు చెబుతాను విను.

**నారద ఉవాచ:** పృథుచక్రవర్తితో నారదుడు చెబుతున్నాడు.

సముద్రనందనుడయిన శంఖుడనే రాక్షసుడు త్రిలోక కంటకుడయి సర్వదేవతాధికారాలనూ హస్తగతం చేసుకుని, వారిని స్వర్గం నుంచి తరిమివేశాడు. పారిపోయిన దేవతలు తమ తమ భార్యా బంధువులతో సహా మేరు పర్వత గుహలలో తల దాచుకున్నారు. అయినా శంఖుడికి తృప్తి కలగలేదు. పదవులు పోయినంత మాత్రాన పటుత్వాలు పోతాయా? పదవి లేనప్పుడే పునః దానిని సాధించుకోవడం కోసం తమ బలాన్ని పెంచుకుంటారు. ఆ రీత్యా వేదమంత్రాల వల్ల దేవతలు శక్తివంతులయ్యే అవకాశం వుంది గనుక, వేదాలను గూడ తన కైవసం చేసుకోవా'లనుకున్నాడు. విష్ణువు యోగ నిద్రగతుడయిన ఒకానొక వేళలో బ్రహ్మనుండి వేదాలను అకర్షించాడు. కాని యజ్ఞమంత్ర బీజాలతో గూడిన వేదాలు శంఖుని చేతి నుంచి తప్పించుకొని ఉదకాలలో తలదాచుకున్నాయి. అది గుర్తించిన శంఖుడు సాగరంలో ప్రవేశించి వెదికాడు గాని, వాటిని పసిగట్టలేక పోయాడు. అంతలోనే బ్రహ్మ, పూజాద్రవ్యాల్ని సమకూర్చుకొని, మేరు గుహాలయ వాసులయిన దేవతలందరినీ వెంటబెట్టుకుని, వైకుంఠం చేరాడు. సమస్త దేవతానీకమూ కలిసి వివిధ నృత్య వాద్యగీత నామస్మరణాదులతోనూ ధూపదీప సుగంధ ద్రవ్యాదులతోనూ కోలాహలం చేస్తూ యోగ నిద్రాగతుడయిన శ్రీహరిని మేల్కొలిపే ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు నిదురలేచిన ఆ శ్రీహరిని షోడశోపచారాలా పూజించి, శరణుకోరారు దేవతలు. శరణాగతులైన సురతతులను చూసి రమాపతి ఇలా అన్నాడు. 'మీరు చేసిన సర్వోపచారాలకూ సంతోషించిన వాడై మీ పట్ల వరదుడి నవుతున్నాను.

ఈ కార్తీక శుద్ధ ఏకాదశి రోజు తెల్లవారు ఝామున నేను మేలుకొనే వారకూ మీరు ఏ విధంగా నయితే సేవించారో అదే విధంగా ధూపదీప సుగంధ ద్రవ్యాదులూ, నృత్య గీత వాద్య నామస్మరణాదులతోనూ, షోడశోప చారాలతోనూ, కార్తీక శుద్ధ ఏకాదశీ ప్రాతర్వేళ నన్ను సేవించే మానవులు నాకు ప్రియులై నా సాన్నిధ్యాన్ని పొందెదరు గాక! వాళ్ల చేత నాకీయబడిన అర్ఘ్యపాద్యాదులన్నీ కూడా ఆయా భక్తుల సుఖ సౌఖ్యాలకే కారణమగుగాక, ఇప్పుడు మంత్రబీజ సమాయుక్తాలైన వేదాలు ఉదకగతాలైనట్లే, ప్రతీ కార్తీకమాసంలోనూ కూడా వేదాలు జలాశ్రయాలై వర్థిల్లును గాక! నేనిప్పుడే మీనావతారుడనై సముద్రప్రవేశం చేసి శంఖుని సంహరించి వేదాల్ని కాపాడెదను గాక! ఇక నుంచి కార్తీక మాస ప్రాతర్వేళ మానవులచే చేయబడే నదీస్నానం అవబృథ స్నానతుల్యమగు గాక! మరియు, ఓ మహేంద్రా! కార్తీక వ్రతము నాచరించిన వారందరును, నేను వైకుంఠమును, నీవు స్వర్గమును పాలించుట మనకు సహజమైనట్లుగ, పుణ్యలోకములను పొందదగి యున్నారు. ఓ వరుణదేవా! కార్తీక వ్రతనిష్ఠుల కార్యాలకు విఘ్నాలు కలగకుండా రక్షణ చేసి, పుత్రపౌత్ర ధన కనక వస్తు వాహనాది సమస్త సంపదలూ అందించు. ఓ కుబేరా! ఏ కార్తీక వ్రతాచరణం వల్ల మానవులు నా యొక్క సారూప్యాన్ని పొంది జీవన్ముక్తులవుతున్నారో అటువంటి వాళ్లందరికీ నువ్వు నా ఆజ్ఞానుసారంగా ధనధాన్య సమృద్ధిని కలిగించాలి. ముక్కోటి దేవతలారా! ఎవరీ కార్తీక వ్రతాన్ని జన్మవ్రతంగా భావించి విద్యుక్త విధానంగా ఆదరిస్తారో వాళ్లు మీ అందరి చేతా కూడా పూజించతగిన వారుగా తెలుసుకోండి. మేళతాళాలతో, మంగళవాద్యాలతో మీరు నన్ను మేలుకొలిపిన ఈ ఏకాదశి నాకు అత్యంత ప్రీతికరమైనది. అందువలన కార్తీక వ్రత, ఏకాదశీ వ్రతాలనే ఈ రెండింటినీ ఆచరించడం కన్నా నా సాన్నిధ్యాన్ని పొందేందుకు మరో దగ్గర దారి లేదని తెలుసుకోవాలి. తపోదాన యజ్ఞ తీర్థాదులన్నీ స్వర్గఫలాన్నీయ గలవేగాని నా వైకుంఠ పదాన్నీయ లేవు సుమా.'

**తృతీయోధ్యాస్సమాప్తః (మూడవ అధ్యాయము సమాప్తము)**

**చతుర్థాధ్యాయము (మత్స్యావతారము)**

భగవానుడైన శ్రీ మహావిష్ణువు దేవతలకలా ఉపదేశించిన వాడై తత్క్షణమే మహా మత్స్యబాలకమై - వింధ్యపర్వతమందలి కశ్యపుని దోసిలి జలాలలో తోచాడు. కశ్యపుడా చేపపిల్లను తన కమండలములో వుంచాడు. మరుక్షణమే ఆ మీనపుకూన పెరిగిపోవడం వలన దానినొక నూతిలో వుంచాడు. రెప్పపాటు కాలంలోనే ఆశఫరీశిశువు నూతిని మించి ఎదిగిపోవడం వలన, కశ్యపుడు దానిని తెచ్చి ఒక సరస్సులో వుంచాడు. కాని విష్ణు మీనం సరస్సును కూడా అధిగమించడంతో దానిని సముద్రంలో వదలవలసి వచ్చింది. ఆ మహా సముద్రంలో మత్స్యమూర్తి విపరీతంగా పెరిగి శంఖుని వధించి, వాడిని తన చేతి శంఖంగా ధరించి, బదరీ వనానికి చేరి, అక్కడ ఎప్పటివలెనే విష్ణురూపాన్ని వహించి ఋషులను చూసి, ' ఓ మునులారా! వేదాలు ఉదకాలలో ప్రవేశించి రహస్యంగా దాక్కుని వున్నాయి. మీరు వెళ్లి జలాంతర్గతములైన ఆ వేదాలను వెదకి తీసుకుని రండి. నేను దేవగణ సమాయుక్తుడనై ప్రయాగలో వుంటాను' అని చెప్పాడు. విష్ణ్వాజ్ఞను శిరసా ధరించిన ఋషులు సముద్రంలోకి వెళ్లి యజ్ఞబీజాలతో కూడి వున్న వేదాన్వేషణ ఆరంభించారు. ఓ పృథు మహారాజా! ఆ వేదాలలో నుంచి ఆ ఋషులకు ఎవరికెంత లభ్యమయ్యిందో అది వారి శాఖయైనది. తదాదిగా ఆయా శాఖలకు వారు ఋషులుగా ప్రభాసించారు. అనంతరం వేదయుతులై, ప్రయాగయందున్న విష్ణువును చేరి వేదాలను తెచ్చామని చెప్పారు. విష్ణ్వాజ్ఞపై ఆ సమస్త వేదాలనూ స్వీకరించిన బ్రహ్మ - ఆ శుభవేళను పురస్కరించుకుని, దేవతలతోనూ ఋషులతోనూ కూడిన వాడై అశ్వమేధయాగాన్ని ఆచరించాడు. యజ్ఞానంతరం గరుడ సమస్త దేవగంధర్వ యక్షపన్నగ గుహ్యకాదులందరూ కూడి శ్రీహరినిలా ప్రార్థించారు. ' ఓ దేవాధిదేవా! జగన్నాయకా! మా విన్నపాలను విను. అత్యంత సంతోషదాయకమైన ఈ సమయంలో మాకు వరప్రదాతనై మమ్మల్ని కాపాడు. హే లక్ష్మీనాధా! నీ అనుగ్రహం వల్లనే బ్రహ్మ తాను నష్టపోయిన వేదాలను ఈ స్థలంలో పొందగలిగాడు. నీ సమక్షంలో మేమందరమూ యజ్ఞంలోని హవిర్భాగాలనూ పొందాము. కాబట్టి, నీ దయవలన ఈ చోటు భూలోకంలో సర్వశ్రేష్ఠమైనదీ, నిత్యమూ పుణ్యవర్ధకమైనదీ, ఇహపర సాధకమైనదిగానూ యగుగాక! అదే విధంగా - ఈ కాలం మహా పుణ్యవంతమైనదీ బ్రహ్మ హత్యాది పాతకాలను సైతం తొలగించేది, అక్షయ ఫలకరమైనదీ అయ్యేట్లుగా కూడా వరాన్ని అనుగ్రహించు.' దేవతల ప్రార్థనను వింటూనే వరదుడైన శ్రీహరి దివ్యమందహాసాన్ని చేశాడు. దైత్యారి 'దేవతలారా! మీ అభిప్రాయం నాకు సమ్మతమైంది. మీ వాంఛితం ప్రకారమే ఇది పుణ్య క్షేత్రమగుగాక! ఇక నుంచి బ్రహ్మ క్షేత్రమనే పేర ప్రఖ్యాతి వహించుగాక. అనతికాలంలోనే సూర్యవంశీయుడైన భగీరథుడి క్షేత్రానికి గంగను తీసుకొని వస్తాడు. ఆ గంగా - సూర్యసుతయైన కాళిందీ ఈ పుణ్యస్థలిలోనే సంగమిస్తాయి. బ్రహ్మాదులైన మీరందరూ నాతో కూడుకున్నవారై ఈ తావుననే సుస్థితులయ్యెదరు గాక! ఇది తీర్థరాజముగా ఖ్యాతి వహించుగాక! ఈ నెలవునందు ఆచరించే జప తపో వ్రత యజ్ఞ హోమనార్చనాదులు అనంత పుణ్యఫలదాలై నా సాన్నిధ్యమును అందిచ్చును గాక. అనేకానేక జన్మకృతాలైన బ్రహ్మహత్యాది ఘోరపాతకాలు సహితం ఈ క్షేత్రదర్శన మాత్రం చేతనే నశించిపోతాయి. ఇక్కడ నా సామీప్యంలో మరణించిన వాళ్లు నా యందే లీనమై మరుజన్మ లేని వాళ్లవుతారు. ఎవరైతే ఈ తీర్థంలో స్థిరచిత్తులై పితృకర్మలను ఆచరిస్తారో, వాళ్ల పితరులు నా సారూప్యాన్ని పొందుతారు. ఈ కాలం సర్వదా పుణ్యఫలాన్నిస్తుంది. సూర్యుడు మకరమందుండగా ప్రాతఃస్నానం చేసిన వాళ్లని చూసినంత మాత్రం చేతనే సామాన్య దోషాలన్నీ సమసిపోతాయి. వాళ్లకి నేను క్రమంగా సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యాలను ప్రసాదిస్తాను. ఓ ఋషులారా! శ్రద్ధాళువులై వినండి. నేను సర్వకాల సర్వావస్థలలోనూ కూడా ఈ బదరీవన మధ్యంలోనే విడిది చేసి వుంటాను. ఇతరేతర క్షేత్రాలలో సంవత్సరాలుగా తపస్సు చేయడం వల్ల ఏ ఫలం కలుగుతుందో ఆ ఫలాన్ని ఈ క్షేత్రంలో ఒక్క రోజు తపస్సుతోనే పొందవచ్చు. ఈ తీర్థ దర్శనమాత్రం చేతనే సర్వులూ తమ పాపాలను పోగొట్టుకున్నవారై జీవన్ముక్తులవుతారు.

శ్రీ మహావిష్ణువు ఈ విధంగా దేవతలకు వరప్రదానం చేసి బ్రహ్మతో కలిసి అంతర్హితుడయ్యాడు. ఇంద్రాదులందరూ కూడా తమ తమ అంశలను ఆ క్షేత్రంలో విడిచి, తాము కూడా అదృశ్యులయ్యారు. ఓ పృథు నృపాలా! ఆ బదరీవన యాత్రా దర్శనాదుల చేత మానవులెంతటి పుణ్యాన్ని పొందగలరో అంతటి పుణ్యాన్నీ కూడా ఈ కథా శ్రవణ మాత్రం చేతనే పొందగలరయ్యా!' అని చెప్పి ఆగాడు నారదుడు.

**పదునేడవ (బహుళ విదియ) రోజు పారాయణము సమాప్తము**

## కుషాక్ మరియు స్లావియా మోడల్స్ కోసం సరికొత్త డీప్ బ్లాక్ రంగుల్లో అద్భుతమైన ఎడిషన్ లను విడుదల చేసిన స్కోడా ఆటో

**ముంబయి, (విశాఖ సమాచారమ్):** ప్రీమియం సెగ్మెంట్ మోడల్స్ లో స్కోడా కార్లకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీటిల్లో ఉన్న ఫీచర్స్ ఇతర కార్లతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడు మరోసారి కుషాక్ మరియు స్లావియాలో సెగ్మెంట్-ఫస్ట్ ఫీచర్లను పరిచయం చేసిన వెంటనే, స్కోడా ఆటో ఇండియా ఈ రెండు కార్ల యొక్క కొత్త, ప్రత్యేకమైన వెర్షన్‌ను ప్రకటించింది. ఈ రెండు కార్లు పరిమిత మొత్తంలో ఉత్పత్తి చేస్తారు. అంతేకాకుండా 1.5 ఇంజిన్‌తో ప్రత్యేకంగా అందుబాటులో ఉంటాయి.

ఈ సందర్భంగా స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ సాల్క్ మాట్లాడుతూ, "కుషాక్ మరియు స్లావియా యొక్క ఎలిగన్స్ ఎడిషన్ పరిమిత ఆఫర్‌గా విడుదల చేయబడుతుంది. కుషాక్ మరియు స్లావియాపై క్లాసిక్ బ్లాక్ కలర్‌కు బలమైన డిమాండ్ ఉంది. మా కస్టమర్-సెంట్రిక్ విధానానికి అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న కస్టమర్ ట్రెండ్‌లపై ఆధారపడి ఉంటాయి. కొత్త, ఎలిజెన్స్ ఎడిషన్‌ల సౌందర్యం, బాడీ కలర్ మరియు కాస్మెటిక్ అంశాలు అపారమైన విలువను మరియు యాజమాన్యం యొక్క అహంకారాన్ని అందించడం కొనసాగిస్తూనే, అద్భుతమైన డిజైన్ సెన్స్‌తో కస్టమర్‌లను ఆకర్షిస్తాయి.

డిజైన్ ఎలిగన్స్ ఎడిషన్ రెండు కార్లలో క్లాసిక్, ఆల్-న్యూ మరియు అద్భుతమైన డీప్ బ్లాక్ పెయింట్‌ను అందిస్తోంది, అదే సమయంలో చుట్టూ ఉన్న రిచ్ క్రోమ్ ఎలిమెంట్స్ ను కంటిన్యూ చేస్తుంది. క్రోమ్ లోయర్ డోర్ గార్నిష్ మరియు బి-పిల్లర్‌లపై కాలిగ్రాఫిక్ 'ఎలిగన్స్' రెండు కార్లలో సౌందర్యాన్ని మరింతగా పెంచుతుంది. స్లావియాలో క్రోమ్ ట్రంక్ గార్నిష్ మరియు 'స్లావియా' అని రాసి ఉన్న స్కఫ్ ప్లేట్ ఉంది. కుషాక్ 17-అంగుళాల (43.18 సెం.మీ.) VEGA డ్యూయల్ టోనీలాయ్ డిజైన్‌ను పొందింది, ఇది స్టైల్ మరియు దాని కఠినమైన భూభాగ వైఖరికి ప్రాధాన్యతనిస్తుంది.

## అమెరికాపై ఉపగ్రహ నిఘా పెట్టిన కిమ్



నార్త్ కొరియా సుప్రీం లీడర్ కిమ్ తాజాగా సంచలన ప్రకటన చేశారు. తాము అంతరిక్షంలోకి పంపిన నిఘా ఉపగ్రహం అమెరికా అధ్యక్ష భవనాన్ని ఫొటోలు తీసిందని చెప్పారు. వైట్ హౌస్ తో పాటు పెంటగాన్, అక్కడికి దగ్గర్లోని నావల్ బేస్ ల ఫొటోలను మంచి క్లారిటీతో తీసిందన్నారు. గ్వామ్, పెరల్ హార్బర్ సహా పలు కీలక ప్రాంతాలకు సంబంధించిన ఫొటోలను తీసి పంపించిందని చెప్పారు. సుప్రీం లీడర్ కిమ్ ను కోట్ చేస్తూ నార్త్ కొరియా ప్రభుత్వ మీడియా ఈ వివరాలను వెల్లడించింది.

కిందటి వారం నార్త్ కొరియా ఓ నిఘా ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపించింది. ఈ శాటిలైట్ విజయవంతంగా కక్ష్యలోకి చేరిందని, ఇప్పటికే తన పని మొదలు పెట్టిందని కిమ్ సోమవారం వెల్లడించారు. ఈ ఉపగ్రహంతో నార్త్ కొరియా శత్రువులపై నిరంతరం నిఘా పెడతామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఉపగ్రహ పనితీరును పరిశీలిస్తున్నామని, డిసెంబర్ 1 నుంచి పూర్తిస్థాయిలో నిఘా పెడతామని చెప్పారు.

అయితే, నార్త్ కొరియా పంపించిన ఉపగ్రహం గురించి కానీ, దాని పనీతీరు గురించి కానీ బయటి ప్రపంచానికి ఎలాంటి వివరాలు తెలియవు. వాటితో పాటు ప్రస్తుతం ఆ శాటిలైట్ తీసినట్లు చెబుతున్న ఫొటోల వివరాలపైనా ప్రపంచ దేశాలకు ఎలాంటి స్పష్టత లేదు. శాటిలైట్ వివరాలు కానీ, అది తీసిన ఫొటోలు కానీ నార్త్ కొరియా ఇప్పటి వరకు బయటపెట్టలేదు.

## ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 19 మందికి కంటి ఆపరేషన్లు




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ముత్యాల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ లో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారు మంగళవారం తిరిగి అనకాపల్లి చేరుకున్నారు ఎం.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం, రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆసుపత్రి అనకాపల్లి సౌజన్యంతో నవంబర్ 24 తేదీన ఎం.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఉచిత కంటి పరీక్షా శిబిరంలో కంటి ఆపరేషన్లకు 19 మందిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం పంపించడం జరిగింది.

## మహాత్మాజ్యోతిరావు పూలే కు నివాళి లర్పించిన మేయర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం గ్రీన్ పార్క్ దగ్గర జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా నివాళు లు అర్పించిన విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమరి, జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు మరియు ద్రోణంరాజు శ్రీవాత్సవ్.

గ్రీన్ పార్క్ దగ్గర జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళు లు అర్పించిన వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శ్రీనివాస్, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, మరియు కార్పొరేషన్ చైర్మన్లు డైరెక్టర్ లు జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు, జిల్లా బీసీ కులాల నాయకులు, వైఎస్ఆర్ సీపీ శ్రేణులు పాల్గొని జ్యోతిరావు పూలేకి ఘనమైన నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా మన్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం బీసీల అభ్యున్నతికి పాటు పడి అణగారిన వర్గాలకు పవెనుకబాటు తనానికి చదువు తోనే వారికి న్యాయం జరుగుతుంది అని సావిత్రి బాయి పూలే ద్వారా దేశం లోనే మొదటి ఉపాధ్యాయురాలుగా అందరినీ చైతన్య పరిచిన టువంటి వారిని స్మరించుకుని వారి అడుగు జాడల్లో నడవడమే మనం ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని పేర్కొన్నారుఅణగారిన వర్గాలకు మేలు చేయాలన్న దానిపై పోరాడి విప్లవ జ్యోతి గా అట్టడుగు వర్గాల వెనుకబాటు తనానికి బడుగులు బానిసలుగా ఉం డడానికి దోపిడీ, అణిచివేత, వివక్షలను అర్థం చేసుకోవడానికి చదువు లేకపోవ డమే కారణమని అందరికీ చదువు వుండాలని పాటు పడి అణిచివేతకు గురౌతున్న కులాల, ప్రజల పక్షాన పోరాడటమే కాకుండ ఆధిపత్య వర్గాలు వితంతువుల పునర్వివాహానికి గొప్ప కృషి చేశారని అలాంటి మహానాయకుడు అడుగుజాడల్లో నడుస్తూ ఆయన చేసినటువంటి త్యాగాలను భవిష్యత్ భావితరాలు గుర్తుంచుకోవాలని హితవు పలికారు... అంతేకాకుండా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి బడుగు బలహీనర్గాలకు పెద్ద పీట వేశారు అని అలాంటి జగన్ మోహన్ రెడ్డిని అభినవ పూలే గా అభివర్ణించారు.

## ఏ క్షణమైనా మీ వాళ్లు బయటకు.. కూలీల కుటుంబాలకు సమాచారం



**ఉత్తర్‌కాశీ:** ఉత్తరాఖండ్‌లోని ఉత్తర్‌కాశీ సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను కాపాడేందుకు చేపట్టిన సహాయక చర్యలు శరవేగంగా సాగుతున్నాయి. నేలకు సమాంతరంగా తొలుత చేపట్టిన పనులు ఆగిపోయిన చోట 12 మంది 'ర్యాట్ హోల్ మైనర్లు' (బొగ్గు గనుల్లో సన్నని మార్గాలను తవ్వడంలో నిపుణులు) వడివడిగా తవ్వకాలు చేస్తున్నారు. ఏ క్షణమైనా బాధితులను బయటకు తీసుకొచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే కూలీల కుటుంబాలకు కూడా సమాచారమిచ్చారు.

"ఇంకా తవ్వకం పనులు కొనసాగుతున్నాయి. మరో 2-3మీటర్ల డ్రిల్లింగ్ చేయాల్సి ఉంది. ఈ సాయంత్రం ఐదింటికల్లా సానుకూల ఫలితాన్ని ఆశించొచ్చు" అని మైక్రో టన్నెలింగ్ నిపుణుడు క్రిస్ కూపర్ మీడియాకు తెలిపారు. మరోవైపు, మాన్యువల్ డ్రిల్లింగ్‌పైనే పూర్తి దృష్టి సారించేందుకు.. కొండ పైభాగం నుంచి డ్రిల్లింగ్ పనులను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు ఆయన వెల్లడించారు.

తాజా పరిస్థితులపై కూలీల కుటుంబాలకు ఇప్పటికే అధికారులు సమాచారమిచ్చారు. "వారి దుస్తులు, బ్యాగులతో సిద్ధంగా ఉండండి" అని కుటుంబ సభ్యులకు తెలిపారు. సొరంగం నుంచి కూలీలను బయటకు తీసుకొచ్చేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఇప్పటికే మాక్ డ్రిల్ నిర్వహించారు. వారిని బయటకు తీసుకొచ్చిన తర్వాత వెంటనే వైద్య చికిత్స అందించనున్నారు. ఇందుకోసం సిల్‌క్యారాకు 30 కిలోమీటర్ల దూరంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వద్ద 41 పడకలతో తాత్కాలిక వార్డ్‌ను సిద్ధం చేశారు. కూలీలను తరలించేందుకు సొరంగం వద్ద అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. అంబులెన్స్‌లు వెళ్లేందుకు వీలుగా రోడ్లను మెరుగుపర్చారు.

ఈ కూలీలు గత 16 రోజులుగా సొరంగంలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఇటీవల సొరంగంలోకి ఎండోస్కోపి తరహాలోని కెమెరాను పంపి వారితో మాట్లాడారు. కూలీలంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. వారి కోసం గొట్టాల్లో నుంచి ఆహారం, పానీయాలను పంపుతున్నారు. బాధితుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు వాకీటాకీలను పంపి వారితో అధికారులు మాట్లాడుతున్నారు.

## పాపయ్య సంతపాలెం గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి మండలం పాపయ్య సంత పాలెం గ్రామంలో వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ మంగళవారం పర్యటించారు. దీనిలో భాగంగా గ్రామ ప్రజలు, రైతులు, రజకులు తదితరులు తమ సమస్యలను రత్నాకర్‌కు వివరించారు. ప్రధానంగా గ్రామంలో లో- వోల్టేజి కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, మోటార్లు, పలు విద్యుత్ పరికరాలు లో- వోల్టేజి కారణంగా కాలిపోతున్నాయని, అదనంగా గ్రామంలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, గ్రామంలో విద్యుత్ ల్కెన్‌మెన్, హెల్పర్ లేరని వివరించారు. అలాగే గ్రామంలో దోబీఖానా లేకపోవడంతో బట్టలు ఉతికేందుకు తమకు తగిన సౌకర్యం కలిగిన ప్రదేశం, నీటి సౌకర్యంలేక అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని రజకులు తమ సమస్యలు వివరించారు. అలాగే గ్రామంలో రెండేళ్ల క్రితం ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా బి-ఫారం కలిగిన భూములను తీసుకున్నారని అయితే తమకు వేరేచోట ఇవ్వాల్సిన 18 సెంట్ల స్థలాన్ని ఇప్పటి వరకు కేటాయించలేదని వివరించారు. బి-ఫారం భూముల ఆక్రమణలో ఉన్న వారికి 8 సెంట్ల స్థలం కేటాయించాల్సి ఉండగా అదీ ఇప్పటి వరకు అమలు కాలేదని పలువురు రైతులు రత్నాకర్‌కు వివరించారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన రత్నాకర్ గ్రామంలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొల్లేటి సత్తిబాబు, బొట్టా అప్పలరాజు, గంగిరెడ్ల గోవింద, మంగబాబు, అప్పలకొండ, మారంశెట్టి సన్నిబాబు, మంగనాయుడు, అక్కిరెడ్డి శివ, దాసరి శ్రీను, బొడ్డపాటి చినరాజారావు, పాకలపాటి నర్సింహరాజు, మొల్లి రమణబాబు, ఇంటి త్రినాధ్, ఒమ్మి శ్రీను, నందారపు కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వ సంస్కరణలతో మూతపడ్డ పలుబడులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వైసిపి ప్రభుత్వం విద్య వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల ప్రభావం వలన ప్రభుత్వ, ఎయిడెడ్ బడులు గడిచిన నాలుగు సంవత్సరాలలో 4709 పాఠశాలలు మూతపడ్డాయని తెలుగు దేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకట రావు జగన్ మోహన్ రెడ్డి పై విమర్శలు చేశారు. పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధమని, తాను పేదల పక్షమని చెప్పున్న జగన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలు లేకుండా చేస్తున్నారని వెంకటరావు అన్నారు. సంస్కరణల ప్రభావంతో 2045 ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలకు తాళాలు పడ్డాయని, కరోనా సమయములో చిన్న ప్రైవేటు పాఠశాలల్లో నడపలేక 2664 మూసి వేసుకున్నారని వెంకటరావు తెలిపారు. 2019-20 విద్యా సంవత్సరంలో రాష్ట్రం మొత్తం మీద 63,463 పాఠశాలలు ఉన్నాయని ప్రస్తుతం విద్యా సంవత్సరంలో 2023-24 విద్యా సంవత్సరానికి 58,754 మాత్రమే ఉన్నాయని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నాలుగు సంవత్సరాలలో 4709 పాఠశాలల్లో కనుమరుగయ్యాయని ఇది జగన్ రెడ్డి సాధించిన విద్య ప్రగతిని వెంకటరావు ఎద్దేవా చేశారు.నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కాంద్రేగుల సత్యనారాయణ మాట్లాడు తూ పాఠశాలలు మూతపడడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిందని కరోనా వల్ల 2020-21,2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, ప్రైవేటు పాఠశాలలు నడవకపోవడంతో ఈ రెండేళ్లలో సుమారు 44 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లోనే ఉన్నారని 2019-20 లో ప్రభుత్వ ఎయిడెడ్ బడుల్లో చదివిన వారి సంఖ్య 40,15,881 ఉన్నారని ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ సంఖ్య 38,25,000 కు పడిపోయిందని, అంటే నాలుగు సంవత్సరాలలో 1,90,881 మంది ప్రభుత్వ విద్యకు దూరమ య్యారని ఇదంతా జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాల వల్ల పేద విద్యార్థులు విద్య కు దూరమయ్యారని సత్యనారాయణ ఆవేదన వ్యక్తపరిచారు. విలేకరుల సమావేశంలో బీసీ సెల్ అధికార ప్రతినిధి విల్లూరి రమణబాబు కాంద్రేగుల సత్యనారాయణ వేగి వెంకటరావు కొణతాల కారుబాబు తదితరులు పాల్గొన్నారు.

## జాలరుల వలకు చిక్కిన అరుదైన చేప



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సముద్రంలో వేటకు వెళ్లిన జాలరి వలకు అరుదైన చేప చిక్కింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక మత్స్యకారుల వలకు గోల్డెన్ ఫిష్‌గా పిలిచే అరుదైన కచిడి చేప సోమవారం (నవంబర్ 27) సముద్రంలో చిక్కింది. భారీ సైజులో ఉన్న ఈ చేపను కొనుగోలు చేసేందుకు స్థానిక వ్యాపారులు ఎగబడ్డారు. చేప విక్రయానికి నిర్వహించిన వేలం పాటలో పూడిమడకకు చెందిన వ్యాపారి మేరుగు కొండయ్య ఏకంగా రూ.3.90 లక్షలు చెల్లించి కొనుగోలు చేశాడు. ఈ చేప బరువు దాదాపు 27 కేజీల వరకు తూగిందని మత్స్యకారుడు మేరుగు నూకయ్య తెలిపారు.

కాగా కచిడి చేప ఎప్పుడు దొరికిన భారీ మొత్తంలో అమ్ముడు పోతుంది. అందుకు ఈ ప్రత్యేక చేపలోని విశేష ఔషధ గుణాలే కారణం. ఈ చేప తింటే పలు రోగాలు నయం అవుతాయని స్థానికులు చెబుతున్నారు. ఆసుపత్రుల్లో ఆపరేషన్ నిర్వహించిన తర్వాత కుట్లు వేసే దారాన్ని ఈ చేప గాల్ బ్లాడర్‌తో తయారు చేస్తారని, మందుల తయారీలోనూ ఈ చేప భాగాలను ఉపయోగిస్తారని మత్స్యకారులు తెలిపారు. ఇలాంటి చేపలు అరుదుగా మాత్రమే దొరుకుతుంటాయని వాళ్లు చెబుతున్నారు.

**ఈ ముర్రాజాతి గేదె ధర రూ.4.60 లక్షలు..**

హరియాణాలోని ఝజ్జర్ జిల్లా ఖాన్‌పుర్‌కు చెందిన ఓ ముర్రాజాతి గేదె రికార్డు ధరకు అమ్ముడు పోయింది. గేదె యజమాని రణవీర్ షియోరాన్ దాదాపు రూ.4.60 లక్షలకు గేదెను అమ్మాడు. భారీ ధర పలికినందుకు గేదె యజమాని సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. దీంతో నోట్లతో తయారు చేసిన మాలను గేదెకు వేసి దానికి ఘనంగా వీడ్కోలు పలికాడు. ఈ ముర్రాజాతి గేదె రోజుకి 26 లీటర్ల పాలు ఇస్తుందని యజమాని రణవీర్ షియోరాన్ తెలిపాడు. వారి గ్రామానికి చెందిన వికాస్ అనే వ్యక్తి వద్ద గతంలో రూ.78 వేలకు ఈ గేదెను కొనుగోలు చేశానని అన్నాడు. గేదె పోషణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపాడు. రోజు దానికి ఇచ్చే ఆహారం నుంచి సంరక్షణ వరకు ఎంతో జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఈ గేదె వయసు ఆరేళ్లని, అదే గ్రామానికి చెందిన మల్వీంద్ర అనే వ్యక్తి ఈ గేదెను రూ.4.60 లక్షలకు కొనుగోలు చేశాడని యజమాని రణవీర్ షియోరాన్ చెప్పుకొచ్చాడు. ఈ చుట్టుపక్కల ప్రాంతంలో అత్యంత ఖరీదైన గేదె ఇదేనంటూ సంతోషం వ్యక్తం చేశాడు.

## 81వ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీ బాబు ష్యూరి టి కార్యక్రమం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో ఉన్న 81వ వార్డు, నెయ్యిల వీది, వన్ వే ట్రాఫిక్ డౌన్ ప్రాంతాలలో భవిష్యత్తుకు గ్యారెంటీ- బాబు షూరిటీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యుడు తెలుగుదేశం పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన వైకాపా జబ్బుకు టీడీపీ- జనసేన పొత్తే వ్యాక్సిన్ అని అన్నారు.టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే కరెంట్ , గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గిస్తుందన్నారు ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం అని అన్నారు చంద్రబాబు నాయుడు పాలన కోసం రాష్ట్ర ప్రజలందరూ ఎదురుచూస్తున్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను అర్హులందరికీ అందిస్తాంఅని గోవింద సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ- బాబు ష్యూరిటి .ఈ సంధర్భంగా ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ప్రజలకు,మహిళలుకు వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కర్రి బాబి తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీలో తన బంధువులను నియమించుకోవడమే జగన్ పనిగా పెట్టుకున్నారు: అచ్చెన్నాయుడు

నాసిరకం మద్యాన్ని పంపిణీ చేస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. దశలవారీగా మద్యం నిషేధిస్తామని చెప్పిన జగన్.. మద్యం అమ్మకాలను మరింత పెంచారని దుయ్యబట్టారు. మద్యం అమ్మకాల డబ్బును ప్యాలెస్ కు తరలిస్తున్నారని ఆరోపించారు. మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లు లేకుండా చేశారని... మద్యం ధరలను కూడా పెంచారని విమర్శించారు. ఇసుక దొరక్క లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని దోచుకున్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. టీటీడీలో తన బంధువులను నియమించుకోవడమే జగన్ పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సామాజిక న్యాయం అంటే సొంత వర్గానికి న్యాయం చేయడమా జగన్ అని ప్రశ్నించారు.

## కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడానికి కృషి చేయాలి




**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు పార్టీ క్యాడర్ పోరాటాలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నాడు నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి లో ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేషన్ సభ్యులు తనకాల అనంతరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గొంప గోవిందరాజు, బొడ్డు శ్రీనివాసరావు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు రుద్రరాజు ఆదేశాల మేరకు జిల్లాలో, నియోజకవర్గ,మండల,గ్రామ స్థాయిలలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.అలాగే నాలుగు మండలాలకు నియోజకవర్గంలో గల మున్సిపాలిటీకి అధ్యక్షులను త్వరగా నియమించాలన్నారు. దానితో పాటుగా త్వరలోనే బూత్ కమిటీలు కూడా వేసి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులేయాలన్నారు. ప్రజల్లో నిరంతరం తిరుగుతూ స్థానిక సమస్యలను గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, కాకినాడ చినబాబు, కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ రావి రామసత్యం, ఎం.వి.ఆర్ రాహుల్, సుందరపు ఈశ్వరరావు, మల్లపరెడ్డి కోటేశ్వరరావు,దాసరి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## పంపకాలు షురూ.. అడ్డంగా దొరికిన పోలీసు అధికారి



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగియనుంది. ఇక, ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు ఇప్పటి వరకు ఇంటింటికీ తిరిగి, వాడవాడలోనూ మీటింగులు పెట్టిన నాయకులు.. మరో దారి వెతుక్కుంటున్నారు. ఈ క్రమంలో డబ్బులు వెదజల్లే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ విషయంలో ఆ పార్టీ ఈ పార్టీ అనే తేడా లేకుండా.. అన్నీ కూడా.. తమ శక్తి కొలదీ ఓటర్లను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయి.

తాజాగా మల్కాజిగిరి నియోజకవర్గంలో ఓ పోలీసు అధికారులు డబ్బుల కట్టలతో పట్టుబడడం.. అందరినీ విస్మయానికి గురి చేసింది. దొరికాచిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సదరు అధికారిని వెంబడించి మరీ.. ఆయన ప్రయాణిస్తున్న కారును అడ్డుకున్నారు. ఆయనను బయటకు లాగి.. కారులోపల వెతగ్గా.. సుమారు 7 లక్షల రూపాయలు దొరికాయి. ఈ సొమ్మును ఎక్కడికి తీసుకువెళ్తున్నారు? ఎందుకు తీసుకువెళ్తున్నారనే విషయాలపై ఆయన సమాధానం చెప్పలేదు.

కారులోపల మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తున్న బీఆర్ ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి పేరుతో ఉన్న బ్యానర్లు, పాటోలు కనిపించాయి. దీంతో ఆయన పక్షాన ఈ అధికారులు డబ్బులు పంచేందుకు వెళ్తున్నారని.. కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. అయితే.. సదరు అధికారి అక్కడ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. కార్యకర్తలు అడ్డుకున్నారు. ఇదిలావుంటే.. మరోవైపు సిరిపూర్ కాగజ్ నగర్‌లోనూ ఏపీకి చెందిన ప్రసాదరావు అనే ఐజీ ర్యాంకు పోలీసు అధికారిపై కేసు నమోదైంది.

సిరిపూర్ కాగజ్ నగర్ నియోజకవర్గం నుంచి మాజీ ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ తరపున బరిలో ఉన్నారు. ఆయనకు ప్రసాదరావు మిత్రుడు కావడంతో అక్కడ గ్రామాల్లో డబ్బులు పంపిణీ చేసేందుకు ఈయన సోమవారం సాయంత్రం వెళ్లగా.. కాంగ్రెస్ కార్యకర్తలు.. గుర్తించి పోలీసులకు , ఎన్నికల అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి.. ప్రసాదరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

## నాటి మహనీయుల ఆశయాలకు నేడు కొనసాగింపు



**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):** కుల మత జాతి వర్గ వర్ణ వివక్ష చూడకుండా అందరికీ అర్హత ప్రామాణికంగా సంక్షేమాన్ని సమపాలలో అందిస్తున్నామని, నాటి మహనీయుల ఆశయాలకు నేడు కొనసాగింపు సీఎం జగన్ ఆలోచన అని కుల,మత వివక్ష లేని సేవ చేసిన సంఘ సంస్కర్త, సాంఘిక విషయాలపై ఐక్యతతో కూడిన సమాజం సమానత్వం స్వేచ్ఛ ఇనుమడింపజేయాలనే జ్యోతిరావ్ పులే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం జగన్ నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం ద్వారా సమసమాజ పాలన కొనసాగిస్తున్నామని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. స్త్రీలను విద్యావంతులు చేసి ఇతరులకు ఆదర్శంగా స్త్రీ శక్తిని మలచి అంటరానితనాన్ని, వితంతు పునర్వివాహం పట్ల చైతన్యం తీసుకువచ్చి స్వయంగా వితంతువులకు వివాహాలు జరిపించి మహాత్మునిగా జన నీరాజనాలందుకున్నజ్యోతి రావ్ పులే వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని తారువ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను మననం చేసుకుని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ సమాజంలో విలువైన స్వేచ్ఛ సమానత్వం గురించి లోతైన ఆలోచన చేసి సామాజిక న్యాయం పై ఎన్నో రచనలు చేసి కులవివక్షపై పోరాడి, జ్ఞాన సంపద అందరికీ అందించి సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని భావించిన మహనీయుడు జ్యోతి రావ్ పులే అని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు ఏనుగుల మృతికి కారణమయిన గూడ్స్‌రైలు సీజ్



భారతదేశంలో అతి పెద్ద రవాణా వ్యవస్థ రైల్వే. తక్కువ ఖర్చుతో ఎక్కువ సౌకర్యంతో ఉండడంతో చాలామంది ప్రయాణికులు రైలు మార్గానే ఎంపిక చేసుకుంటుంటారు. ఈ రైళ్లు ఎక్కడిక్కడివారినో తమ గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. ఇవి అడవుల గుండా కూడా ప్రయాణిస్తుంటాయి. ఆ క్రమంలో చాలా ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. ఈ ప్రమాదాల్లో కొన్ని వన్యప్రాణులు కూడా మృత్యుబారిన పడుతుంటాయి. తాజాగా అలాంటి ఓ ఘటనే పశ్చిమబెంగాల్‌లో చోటుచేసుకుంది. గూడ్స్ రైలుకు అడ్డంగా వచ్చిన మూడు ఏనుగులు అక్కడిక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో అటవీశాఖ అధికారులు ఆ గూడ్స్ రైలును సీజ్ చేయడం జరిగింది.

**రైలును సీజన్ చేసిన అటవీశాఖ అధికారులు...:** పశ్చిమ బెంగాల్‌లోని అలీపూర్ దువార్నుంచి సిలిగురిం వెళుతున్న గూడ్స్ రైలు రాజభట్ ఖావా వద్ద అడవి మార్గం ప్రయాణిస్తుంది. ఆ సయమంలో రైలుకు అడ్డుగా మూడు ఏనుగులు వచ్చాయి. దాంతో అవి అక్కడిక్కడే ప్రాణాలు విడిచాయి. అలీపుర్‌ద్వార్ జిల్లాలో రాజభటావా అడవుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సోమవారం ఉదయం 7.20 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో గూడ్స్ రైలును అటవీశాఖ అధికారులు సీజ్ చేయడం జరిగింది.

ఐడీఎస్ లేకపోవడం వల్లే ఏనుగులు మృతిచెందాయి...:ఈ విషయంపై చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ దేబల్ రామ్ మాట్లాడారు. రైలును సీజ్ చేయటమంటే అది సాంకేతికమైనదని, రైలును

భౌతికంగా స్వాధీనపరచుకోవటం కాదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన స్థలంలోనే ఆ గూడ్స్ రైలు ఉందని స్పష్టం చేశారు. కేవలం పేపర్స్ విషయంలో మాత్రమే సీజ్ ప్రక్రియను జరిపామని ఆయన అన్నారు. ఈ మార్గంలో ఐడీఎస్ లేదని చెప్పారు. ఐడీఎస్ మార్గం అంటే...పట్టాలపైకి ఏమైనా అడ్డంగా వస్తే గుర్తించి అప్రమత్తం చేసేది. అయితే, ఈ మార్గంలో ఐడీఎస్ లేదని రైల్వే అధికారులు చెప్పడం జరిగింది. ఐడీఎస్ ఉన్నచోట ఏనుగులను రైళ్లు ఢీకొన్న ఘటనలు లేవని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఇందులో భాగంగానే గూడ్స్ రైలు డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

## పూలే ఆశయాలను సాధిద్దాం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే సేవలు శ్లాఘనీయమని వైఎస్ఆర్సిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మునగపాకలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పూలే చేసిన కృషి ఎనలేనిదని చెప్పారు. ఆనాడు అద్భుత సమాజ నిర్మాణం మహిళా విద్యతోనే సాధ్యమవుతుందని ఆయన చెప్పినటువంటి అంశాలను నేడు ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. పూలే గారి ఆశయ సాధనకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈరోజు కొత్తగా ఇళ్ల స్థలాలు, డ్వాక్రా రుణాలు , అమ్మ ఒడిస్తున్న ఏ కార్యక్రమమైనా మహిళల పేరిటే మహిళ సాధికారతే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి అన్ని పథకాలు వారి పేరు మీదటే అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన దిశగా అడుగులు వేయాలని కోరారు. ఆయన ఏదైతే విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారో విద్యతోనే సమాజంలో సమూల మార్పులని భావించారో అది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. పాఠశాలల్లో సమూల మార్పులు మౌలిక వసతులు కల్పన, ఇంగ్లీష్ మీడియం, బైజూస్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకొని ప్రపంచ స్థాయి విద్యను అందించే విధంగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నటువంటి వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఇదంతా 1973 కాలంలోనే పూలే సూచించారని ఇప్పటికీ అమలు కాలేదని చెప్పారు..జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత పూలే గారి ఆలోచనలను అమలు చేయడం శుభ సూచకమన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం లో ఉపాధ్యాయులు అంతా అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు గుణాత్మకమైన బోధన అందించాలని యలమంచిలి జిల్లా ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలో స్థానిక బాలికోన్నత పాఠశాలతో పాటు, వేంపాడు ఉన్నత పాఠశాల తదితర పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. సమ్మేటీవ్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరు పరిశీలించారు.. పదవతరగతి విద్యార్థులు ను పలు ప్రశ్నలడిగి సమాధానాలను తెలుసుకున్నారు. నోట్స్ లను పరిశీలించారు. సిలబస్ పూర్తి చేశారో లేదో అడిగి తెలుసుకున్నారు సమ్మేటీవ్ పరీక్షల పేపర్లను ఏరోజుకారోజే దిద్ది మార్కులను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులుకు సమాధాన పత్రాలను చూపించి ప్రగతిపై చర్చించాలన్నారు. అనంతరం స్థానిక బాలికోన్నత పాఠశాలతో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. అభ్యసన సామర్థ్యాలను , టరల్ తదితర రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలన్నారు. ఎనీమియా పిల్లల రికార్డులతో సిద్ధంగా ఉడాలని, టీచింగ్ నోట్స్, పాఠ్యప్రణాళికలను , అభ్యసన సామగ్రితో బోధన చేయాలని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులనడిగి ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సూచనలనందించారు. త్వరలోనే ఆయన మండలంలో అన్నిపాఠశాలలను సందర్శించనున్నానని, ఎటువంటి లోపాలు కనబడినా ఉపేక్షించేది లేదని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ ఉన్నారు.

## పూలే కలలను సాకారం చేస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి

### 133వ వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి నివాళులు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని,అదే బాటలో అయన కన్న కలలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాకారం చేస్తున్నారని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పూలే 133 వర్ధంతిని పురస్కరించుకొని ఎంపీపీ బోదెపు గోవింద్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొరలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే పోరాటాలు, సంస్కరణలు ఆదర్శనీయమని, ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన నాలుగన్నారేళ్లలో అమలుపరిచారన్నారు. బీసీలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని,ఆయన ఆలోచనలకు అనుగుణంగా పరిపాలనలో ముందుకెళ్తూ రాష్ట్ర ప్రజల అభిమానాన్ని సీఎం జగన్ మోహన్ రెడ్డి చూరగొంటున్నారన్నారు. పూలే కలలుగన్న పాలన ముఖ్యమంత్రి జగనన్నతో సాకారమైందన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఓ దేవి ప్రసాద్,కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ వైస్ చైర్మన్ అరేపు గుప్తా, మండల రూరల్ పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాధ్, కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, కో-అప్షన్ సభ్యులు దూది నర్సింహమూర్తి,వైసీపీ పట్టణ, మండల నాయకులు కొఠారు కొండబాబు,మర్రి రాజు, వియ్యపు గోపి,సీతారాం, చంటి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తత్వవేత్త జ్యోతిరావు పూలే



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సామాజిక తత్వవేత్తగా మహాత్మ జ్యోతిరావు పూలే నిలుస్తారని ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఉదయం జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఏయూలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమాజంలో అసమానతలు రూపుమాపడానికి, స్త్రీ విద్యకు ఆయన చేసిన కృషి నిరుపమానమన్నారు. నేటి తరం యువత జ్యోతిరావు పూలే జీవిత చరిత్రనుచదవాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య పి.అర్జున్, ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, చీఫ్ వార్డెన్ జి.వీర్రాజు,లైబ్రేరియన్ పి.వెంకటేశ్వర్లు, బిసి కుమాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేటి రాంబాబు, వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన సిఎం



**విజయనగరం:** విజయనగరం మండలం వేణుగోపాలపురం వద్ద సుమారు రూ.179 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన 220/132/33 కిలోవాట్ల విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి శంకుస్థాపన చేశారు. సిఎం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక ఒంటితాడి అగ్రహారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సబ్ స్టేషన్ నిర్మాణం ద్వారా వివిధ రకాల విద్యుత్ సమస్యలు పరిష్కరించబడతాయి. రైతులకు, పారిశ్రామిక, వాణిజ్య, గృహ అవసరాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా జరుగుతుంది. ముఖ్యంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఈ సబ్ స్టేషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ సబ్‌స్టేషన్ వల్ల విజయనగరం, గజపతినగరం, బొండపల్లి, నెల్లిమర్ల, గుర్ల, గరివిడి మండలాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేయడమే కాకుండా, లో వోల్టేజీ సమస్య పరిష్కరించబడుతుంది. భవిష్యత్తులో రాబోయే పరిశ్రమలకు కూడా ఇది ఉపకరిస్తుంది. దీనిద్వారా గరివిడి ఉప కేంద్రానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే కాకుండా, పెందుర్తి ఉప కేంద్రాలకు ప్రత్యామ్నాయంగా మారుతుంది.

**అభివృద్ధికి దోహదం :** ఈ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం పూర్తి అయితే, వ్యవసాయానికి పగటిపూటే 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి విద్యుత్ సబ్ స్టేషన్లకు, సోలార్ విద్యుత్ ప్లాంట్లకు శంకుస్థాపన చేయడం రాష్ట్రానికి శుభపరిణామంగా పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఇంది ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వేణుగోపాలపురం వద్ద నిర్మించ దలపెట్టిన 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ జిల్లా అభివృద్ధికి మేలుమలుపుగా పేర్కొన్నారు. వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, గృహ అవసరాలు తీరడమే కాకుండా వేసవిలో కూడా విద్యుత్ సమస్యలు ఉండవని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం జిల్లా అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తోందని ఈ సందర్భంగా కోలగట్ల అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎల్ఎన్ రాజు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కెవి సూర్యనారాయణరాజు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఈ ఎం. లక్ష్మణరావు, ఎపి ట్రాన్స్‌కో ఎస్ఈ బి.కోటేశ్వరరావు, పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, విద్యుత్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# జ్యోతిబా పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

## ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి



**విజయనగరం:** బడుగు వర్గాల ఆశా జ్యోతి, సమాజాభివృద్ధికి ఆద్యుడు అయిన జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపునిచ్చారు. జ్యోతిబా పూలే 133 వ వర్ధంతిని కలెక్టరేట్ వద్ద ఘనంగా నిర్వహించారు. జ్యోతిబా పూలే కూడలి వద్ద నున్న జ్యోతిబా పూలే, వారి సతీమణి సావిత్రీ బాయి పూలే విగ్రహాలకు ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పూల మాలలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే మహిళా విద్యాభ్యాసం కోసం కృషి చేస్తూ సామజిక మార్పుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జ్యోతిబా పూలే, వారి సతీమణి భౌతికంగా లేనప్పటికీ వారి ఆశయాలకు , ఆలోచనలకూ ప్రతిరూపంగా ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు కనపడుతున్నాయని పేర్కొన్నారు. బి.సి. నాయకుల ఆకాంక్ష మేరకు ఇద్దరి విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు చేసి , ఆ కూడలికి జ్యోతి బా కూడలిగా పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. వారి ఆశయ సాధనకు ప్రభుత్వం నిరంతర కృషి చేస్తోందని అన్నారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల వారంతా అభివృద్ధి చెందాలని పూలే ఆనాడే భావించారని, వారి ఆశయాల మేరకు నేడు క్షేత్ర స్థాయి లో బి.సి. లను అభివృద్ధి చేయడానికి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి పాటు పడుతున్నారని తెలిపారు. బి సి లకు రాజ్యాధికారాన్ని ఇవ్వడం ద్వారా వారిని ఉన్నతంగా ఎదిగేలా చేయవచ్చని భావించి వారికీ అనేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి పదవులను ఇచ్చారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మహిళల, దళితుల, అట్టడుగు వర్గాల వారి స్థితి గతులను మార్చాలని భావించిన పూలే భార్యా భర్తలు కలసి చదువుకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చారని అన్నారు. తొలుత తన కుటుంబ సభ్యులకే చదువు చెప్పి తదుపరి ఒక పాఠశాలను ఏర్పాటు చేసి మహిళలకు విద్యనూ బోధించారని, తద్వారా మహిళా సాధికారతకు అనాడే తొలి అడుగు వేసారని తెలిపారు. సమాజం లో ఎంతో మార్పు జరిగినప్పటికీ ఇంకను ఎంతో సాధించ వలసి ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

ఈ సమావేశం లో నగర మేయర్ వి. విజయలక్ష్మి, జిల్లా బి.సి. సంక్షేమ అధికారి కిడారి సందీప్, బి.సి కార్పొరేషన్ ఈ.డి పెంటోజీ రావు, ఉత్తరాంధ్ర బి.సి సంఘ నాయకులూ ముద్దాడ మధు, బోయ, రజక, బలిజ,కాపు, వెలమ మత్స్యకార, నాయీ బ్రాహ్మణ, ఏత తదితర కార్పొరేషన్ల డైరెక్టర్లు, పలు బీసి సంఘాల నాయకులూ, ప్రతినిధులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దాడులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎస్పీ కె.వి.మురళీ ఆదేశాల తో పోలీసు అధికారులు, సిబ్బంది నవంబర్ 27న మద్యం, ఇసుక, గంజాయి, కోడిపందాలు మరియు జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేశారు.

అనకాపల్లి మండలం, అచ్చియ్యపేటగ్రామ సమీపంలో ఎస్సై సిహెచ్.నర్సింగరావు కు రాబడిన సమాచారం మేరకు ట్రైనీ డిఎస్పి శ్రీమతి జి.భాగ్య రూరల్ పోలీసులతో కలిసి పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి 6గురు నిందితులను అరెస్ట్ చేసి రూ.14,640/- నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం పరుచుకున్నారు. కృష్ణదేవి పేట పిఎస్ పరిధి ఏఎల్ పురం పి.హెచ్.సీ సమీపంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పద ఆటోను తనిఖీ చేయగా గంజాయి లభ్యమయింది. అక్రమ రవాణా కు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్ చేసి, 4.500 కేజీల గంజాయి, ఒక ఆటో, 4 మొబైల్ ఫోన్ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు .బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజా శాంతికి భంగం కలిగించిన 93 మందిపై కేసులు నమోదు చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందిపై కేసులు నమోదు చేశారు. ప్రజలకు దిశా యాప్ పట్ల అవగాహన కల్పించి,35 మందితో యాప్ డౌన్లోడ్ చేయించారు. 6,00,930 మంది తో యాప్ ను డౌన్లోడ్ చేయించగా, 2,13,611 మందితో రిజిస్ట్రేషన్ చేయించారు.జిల్లా పోలీసులు, సెబ్ అధికారులు దాడి చేసి, 8 కేసులు నమోదు చేసి, 8మంది నిందితులను అదుపులోనికి తీసుకొని, 4 లీటర్ల అక్రమ మద్యం, 650 ఎం.ఎల్ బీరు,10 లీటర్ల నాటు సారా ను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు తమ పరిధిలో ప్రజలకు దిశా యాప్, సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

# అంబరాన్ని తాకిన అయ్యప్ప స్వామి అంబలం పూజ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా స్థానిక కోటవీధిలో వెలసిన స్వయంభు భోగ లింగేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి భక్త బృందం నిర్వహించిన అయ్యప్ప స్వామి అంబలం పూజ అత్యంత ఘనంగా జరిగింది. ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు పాలకమండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ అంబలం పూజ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఆలయ శివ భక్తులు బుద్ధ రమణాజీ, కర్రి సన్యాసినాయుడు, పిల్లా నూకేశ్వరారావు, బుద్ధ మురళి తాతారావు తదితరులు నిర్వహించారు. ఈ అంబలం పూజ కార్యక్రమంలో శ్రీ గౌరీ సేవా సంఘం అయ్యప్ప ఆలయ ఆశ్రమం , కన్యకా పరమేశ్వరి ఆలయ అయ్యప్ప స్వామి ఆశ్రమం, కొణతాల రామకృష్ణ ఆశ్రమం అయ్యప్ప మాలదారులు ఈ సందర్భంగా ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. అయ్యప్ప స్వామి తో పాటు నూకాంబిక అమ్మవారు శ్రీ వెంకటేశ్వర స్వామి మీద ఆలపించిన భక్తి గీతాలు భక్తులు నా కట్టుకున్నాయి. గురుస్వాములు కొణతాల రామకృష్ణ, మద్దాల నారాయణరావు, కటకం లక్ష్మణరావు, పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబలం పూజను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# మెగా జాబ్ ఫేర్ పోస్టర్ ను ఆవిష్కరించిన వైవి సుబ్బారెడ్డి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పశ్చిమ నియోజకవర్గం పరిధి లోని నిరుధ్యోగులకు ఉపాధి లక్ష్యంగా విశాఖ పశ్చిమ నియోజక వర్గం సమన్వయ కర్త, ఎపిఎమ్ఎస్ఎంఇ డిసి ఛైర్మన్ ఆడారి ఆనంద కుమార్ ఏర్పాటుచేసిన మెగా జాబ్ ఫేర్‌కు సంబంధించిన పోస్టర్ ను మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్సిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన నగరంలోని తన కార్యాలయంలో వైఎస్ఆర్ సిపి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌తో కలిసి ఈ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ఈ జాబ్ ఫేర్ కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్న వ్యక్తి ఆడారి ఆనంద్ కుమార్‌ని ఆయన కొనియాడారు . సమస్యలను అందరి నాయకులు వింటారని ఆ సమస్యను తీర్చే నాయకులు కొందరే ఉంటారని అయితే ఆ కొందరులో ఆడారి ఆనంద్ కుమార్ ముందుంటారని ఆయన అన్నారు . డిసెంబర్ 1,2 తేదీల్లో ఎంవివిపి జూనియర్ కళాశాల (అండాలమ్మ కాలేజీ) , అల్వార్ పాలిటెక్నిక్, జింక్ హనుమాన్ టెంపుల్ దగ్గర జరిగే ఈ జాబ్ ఫేర్‌ను నిరుద్యోగ యువత ఉపయోగించుకొని ఉపాధి పొంది ఆర్థిక స్వాలంబన పొందాలని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ ఫెలో అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. వైఎస్ఆర్‌సిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద కుమార్ మాట్లాడుతూ ముందుగా ఈ జాబ్ ఫేర్ కు 50 కంపెనీలు వస్తాయని భావించగా మరల సుమారు 70కి పైగా కంపెనీలు ఈ జాబ్ పేర్ లో పాల్గొనడానికి ఆసక్తి కనబరుస్తున్నాయని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రజల సౌకర్యార్థం రూపొందించిన మీతో ఆనంద్ అనే యాప్‌ను కూడా ప్రజలు... నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జాబ్ ఫేర్ కు సంబంధించి మరిన్ని వివరాలకు ఈ క్రింది నెంబర్లలో ఫోన్ నంబర్లు: 90008 18467, 90009 38467ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ గారు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ గారు, వైయస్సార్ టి యు సి అధ్యక్షులు పుర్రె సురేష్, కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, ముర్రె వాణి నానాజీ, మండల క్లస్టర్ అధ్యక్షులు అంగా రాంప్రసాద్, బీశెట్టి గణేష్, వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# రైళ్ల యొక్క చిన్న ముగింపు మరియు ఆరిజినేషన్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వాల్టెయిర్ డివిజన్‌లోని KK లైన్‌లో భద్రతకు సంబంధించిన పనుల కారణంగా ఈ క్రింది రైళ్ల ముగింపు మరియు మూలం వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

1. 29.11.2023 నుండి 03.12.2023 వరకు విశాఖపట్నం నుండి బయలుదేరే 18514 విశాఖపట్నం-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు దంతేవార వద్ద షార్ట్ టర్మినేట్ చేయబడుతుంది.
2. తిరుగు దిశలో రైలు నెం. 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు కిరండూల్‌కు బదులుగా 30.11.2023 నుండి 04.12.2023 వరకు దంతేవార నుండి విశాఖపట్నం వరకు ప్రారంభమవుతుంది.
3. 29.11.2023 నుండి 03.12.2023 వరకు విశాఖపట్నం నుండి బయలుదేరే 08551 విశాఖపట్నం-కిరండూల్ రైలు దంతేవార వద్ద ముగించబడుతుంది.
4. అదే విధంగా రైలు నం. 08552 కిరండూల్-విశాఖపట్నం రైలు కిరండూల్‌కు బదులుగా 30.11.2023 నుండి 04.12.2023 వరకు దంతెవార నుండి విశాఖపట్నం వరకు బయలుదేరుతుంది.

ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అభ్యర్థించారు.

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు
సంప్రదించండి
8008767633,
7981904385

# కళాశాలల్లో ఓటర్ల నమోదుపై అవగాహన




**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని యలమంచిలి తాశీల్దార్ ఎస్. రాణిఅమ్మాజీ అన్నారు. మంగళవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా యలమంచిలి పట్టణంలో గీతాంజలి డిగ్రీ కళాశాల,పూర్ణసాయి కళాశాలల్లో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ భారతదేశంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధంతో సమానమని, దీనివల్ల ప్రజాస్వామ్య బద్ధంగా ఓట్లు వేసి నాయకులను ఎన్నుకోవడం జరుగుతుంది కనుక 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ తమ ఉజ్వల భవిష్యత్ కోసం తాము వేసే ఓటు ద్వారా మాత్రమే నాయకులు ఎన్నిక కాబడతారు కనుక ఓటు హక్కును కలిగి ఉండటంతో పాటుగా ఓటు వినియోగంపై కూడా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు తప్పకుండా ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా ఓటరు చైతన్యం-దేశ భవితవ్యం, ఓటు లేకుంటే.. జీవించనట్టే లాంటి పలు నినాదాలను ఆమె విద్యార్థులతో చెప్పించారు.అనంతరం రైల్వే స్టేషన్ రోడ్డులో గాంధీ సర్కిల్ వద్ద విద్యార్థులచే మానవహారం చేయించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటి గణపతి, అప్పారావు,పట్టణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విష్ణు,గీతాంజలి కళాశాల కరెస్పాండెంట్ పి.వి.ఎస్.ఈశ్వర దత్తు,పూర్ణసాయి కళాశాల ప్రిన్సిపాల్, బి.ఎల్.ఓలు, కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# తెరువుపల్లిలో జగనన్నే ఎందుకు అవసరం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు యలమంచిలి మున్సిపాలిటి తెరువుపల్లి సచివాలయ పరిధిలో యలమంచిలి వైయస్సార్ పార్టీ కన్వీనర్, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలో 99శాతం హామీలు నెరవేర్చారని,ఏ విధంగా అభివృద్ధి చేశారో నాడు నేడు ప్రశ్న పుస్తకం ద్వారా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కొండలరావు, కౌన్సిలర్ తుంపాల శ్రీను, అధికారులు, స్థానిక నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



Invitation
You are cordially invited on the occasion of Inauguration of
**S.S.N. BAKERY**
Inauguration by
Sri Kankatala Mallikarjuna Rao garu
(Mallik garu)
CMD Kankatala Silks, Visakhapatnam.
Sri Kinjarapu Prabhakar garu
Dy.S.P, Eluru City.
Special Invity
Sri K. Ananda Reddy garu
Deputy Commissioner of Police -II, Visakhapatnam
Special Guest
Sri Peddini Babu Rao garu
Senior Advocate, Visakhapatnam.
On Wednesday 29th November 2023
at 10:21 a.m. at Akkayyapalem, Jaggarao Bridge, Sangam Office, Visakhapatnam.
Your's
Prop. J. Nagabhushanam

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Pardwada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676